

ఓం అరుణాయ.. ఆదిత్యాయ నమః

జిల్లావ్యాప్తంగా మంగళవారం రథ సప్తమి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామునే సూర్యుడికి ప్రణమిల్లి పూజలు చేశారు. రథ సప్తమి సందర్భంగా ద్వారకాతిరుమలలో ఉభయ దేవేరులతో శ్రీ వేంకటేశ్వరస్వామి సూర్యప్రభ వాహనంపై ఊరేగారు.

6

అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

అంబేద్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్వామి, అమ్మవార్లను పెండ్లి కొడుకు, పెండ్లి కుమార్తెలుగా అర్చకులు ముస్తాబు చేశారు.





మీ టీడీపీ ఇన్‌చార్జ్ పనితీరు ఎలా వుంది ?

'మీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పనితీరు ఎలా వుంది ? బాగుంది, బాగాలేదు. పర్వాలేదు' అంటూ పార్టీ అధిష్టానం ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్(ఐవీఆర్) ద్వారా ఫోన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. దీని ద్వారా ఎక్కడైనా ఇన్‌చార్జ్‌ల పనితీరు బాగా లేకపోతే మార్చే అవకాశం ఉంటుంది. మరోవైపు ఎమ్మెల్యేల పనితీరుపైన ఇంటెలిజెన్స్ ద్వారా ఆరా తీసింది. - 7లో..



వింత వైరస్‌తో లక్షల్లో కోళ్లు మృత్యువాత!

ఉమ్మడి పశ్చిమలో కోళ్లకు ఏమైంది. సంక్రాంతి ముందు పందెం కోళ్లు, ఇప్పుడు ఫారం కోళ్లు పిట్టల్లా రాలిపోతున్నాయి. అంతు చిక్కని వైరస్‌తో లక్షల్లో చనిపోతున్నాయి. ఎక్కడికక్కడ వీటిని గోతులు తీసి పూడుస్తున్నారు. మరోవైపు కోడి గుడ్ల ఉత్పత్తి పడిపోయింది. దీనిపై పౌల్ట్రీ రైతులు ఆందోళన చెందుతున్నారు. - 7లో



ఎంఆర్‌ఐ స్కానింగ్‌తో ఆగిన మహిళ గుండె !

ఎంఆర్‌ఐ స్కానింగ్ సెంటర్ నిర్వాహకుల నిర్లక్ష్యానికి ఓ నిండు ప్రాణం బలైంది. గుండెకు పేస్ మేకర్ వున్న మహిళకు స్కానింగ్ చేసి ఆమె మృత్యువుకు కారణమయ్యారు. భార్య మిషన్‌లో విలవిలలాడుతూ ఊపిరి వదలడంతో భర్త కన్నీరు మున్నీరుగా విలపించారు. ఏలూరు సుస్మిత డయాగ్నోస్టిక్ సెంటర్‌లో మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలు - మెయిన్‌లో





కోడ్ బ్రేకులు

కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టి ఎనిమిది నెలలు కావొస్తుంది. ఇంత స్వల్పకాలంలోనే ఏ పనీ చేయనీయకుండా రెండుసార్లు 'కోడ్' రూపంలో వెంటాడింది. కొన్ని సంక్షేమ ఫలితా లను ప్రజలకు చేరువ చేద్దామన్నా ఇదే అడ్డంకి. రాజకీయ పరంగా సరికొత్త నిర్ణయాలకు మోకాలడ్డే. రెండు నెలల క్రితం జరిగిన టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు సందర్భంగా నెల రోజులు, ఇప్పుడు తాజాగా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు సందర్భంగా మరో నెల రోజులు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది.

- సమాంతరంగా ఎన్నికల కోడ్ అమలు
- ఎక్కడికక్కడ నిలిచిన పనులు.. హామీలు
- నామినేటెడ్ పోస్టుల భర్తీకి బ్రేక్
- ఆఖరుకి గృహ ప్రవేశాలకు ఇదే అడ్డంకి

మూడు నెలల వ్యవధిలో రెండు ఎమ్మెల్సీ ఎన్నికలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఆర్థిక సర్దుబాటుకు, వెసులుబాటుకు గత ప్రభుత్వం చేసిన నిర్వాకాలను సరిదిద్దేందుకే సమయం సరిపోతోంది. సంక్షేమ ఫలాలు నేరుగా చేతికి అందాలని జనం, కొత్త ప్రభుత్వంలో ఇన్నాళ్లు కష్టపడిన దానికి కాసింత నామినేటెడ్ పదవులతో సంతృప్తిపడేందుకు నేతలు, తమకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు ఒకరి వెంట ఒకరు ఉన్నారు. కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టి ఎనిమిది నెలలు కావొస్తుండగా ఈ స్వల్పకాలంలోనే రెండుసార్లు ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చిపడ్డాయి. వీటి నిర్వహణకు వీలుగా ఎన్నికల కోడ్ విధిగా అమలు చేయాల్సిందే. తొలుత నెల క్రితం టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగ్గా 30 రోజుల పాటు కోడ్ అమలులో ఉంది. కోడ్ నేపథ్యంలో ఎటువంటి హామీలు, ప్రజలను ప్రభావితం చేసేలా సమావేశాలు, సమీక్షలు, ఇతరత్రావేవీ చేయకూడదు. అంతోఇంతో లక్ష్యాలను చేరుకుందామన్న తపనలో ఉన్న కూటమి ప్రభుత్వానికి తొలి ఆటంకం ఏర్పడింది. ఇళ్లు, ఇళ్ల స్థలాలతో పాటు మరికొన్ని సంక్షేమ పథకాలను సమీక్షించే అవకాశం లేకుండా పోయింది. టీచర్స్ ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉండగా రాజకీయపరంగా మరికొన్ని పరిణామాలు జరిగాయి. జిల్లా పరిషత్‌లో అవిశ్వాసం పెట్టేం దుకు వైసీపీ వర్గం నోటీసులు ఇచ్చేందుకు ప్రయత్నించారు. కోడ్ అమలులో ఉండగా రాజకీయపర అంశాలపై నిర్ణయాలు తీసుకోలేమని దీనిని వాయిదా వేశారు. ఈ పరిణామం కాస్త అటు తెలుగుదేశంలోను, ఇటు వైసీపీలోను దాదాపు నెలపాటు ఉత్కంఠ రేపింది.

ఈసారి కూడా అంతే..

ఉపాధ్యాయ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత యంత్రాంగాన్ని పరుగులు పెట్టించడమే కాకుండా కొన్ని సంక్షేమ పథకాల విషయంలో కీలక నిర్ణయాల వైపు కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. పెండింగ్‌లో ఉన్న పేదల పక్కా ఇళ్లను వారికి స్వాధీనపర్చేందుకు వీలుగా సీఎం చంద్రబాబు ఈనెల ఒకటో తేదీన కొవ్వూరు పర్యటనకు నిర్ణయించారు. ఈ మేరకు జిల్లాలో పూర్తయిన దాదాపు 65 వేలకు పైగా ఇళ్లను పేదలకు అప్పగించే దిశగా అధికారులు పరుగులు పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా గృహ ప్రవేశాలకు ఈనెల ఒకటిన ముహూర్తంగా ప్రభుత్వం భావించింది. లబ్ధిదారులు తమకు సొంతిల్లు స్వాధీనం కాబోతుందన్న ఆనందంలో మునిగారు.ఈ సమయంలోనే పట్టభద్రుల నియోజకవర్గానికి ఎన్నికల షెడ్యూల్ గత నెల 29న వచ్చింది. ఆ వెంటనే కోడ్ అమలులోకి వచ్చింది. సీఎం దీంతో కొవ్వూరులో తలపెట్టిన కార్యక్రమం వాయిదా పడడంతో వేలాది మంది పేదలకు నిరాశ తప్పలేదు.

నామినేటెడ్ ఉత్సాహంపై నీళ్లు

ఇంకోవైపు రాజకీయపరంగా నామినేటెడ్ పోస్టుల భర్తీకి గడిచిన రెండు మాసాలుగా జరుగుతున్న కసరత్తు ప్రభావంతో ఈనెలలో జాబితా విడుదలకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేసింది. విడతల వారీగా నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తూ వస్తున్నారు. మార్కెట్ కమిటీలు, సహకార సంఘాలకు రిజర్వేషన్ల జాబితాలు జిల్లా యంత్రాంగం ఆమోదం పొందాయి. ఏఎంసీల నియామకంలో తగిన ప్రక్రియ ఆరంభించాల్సిందిగా ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లా వ్యాప్తంగా తొమ్మిదికి పైగా ఉన్న మార్కెట్ కమిటీల్లో ఎవరెవరికి చోటు దక్కబోతుందో నియోజక వర్గాల వారీగా విస్తృత ప్రచారం సాగింది. జిల్లాలో 256కు పైగా సహకార సంఘాలు ఉండగా, వీటన్నింటిలోనూ కమిటీలను నియమించేందుకు అనువుగా సిట్టింగ్ ఎమ్మెల్యేలు సుదీర్ఘ చర్చలు సాగించారు. ఇంత చేస్తే పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. వచ్చే నెల 5వ తేదీ తర్వాతే ఈ తరహా నామినేటెడ్ ప్రక్రియ ఆరంభమవుతుంది. అప్పటివరకు అంతా గప్‌చుప్.

జెండాలు లేని ఎన్నికలు

ఇంతకుముందు జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీల్లో, ఇప్పుడు జరగబోతున్న పట్టభద్రుల ఎన్నికల్లో రాజకీయాలకు అతీతంగా జెండాలకు చోటులేదు. అయినా పట్టభద్రుల నియోజకవర్గాన్ని కైవశం చేసుకుని తీరాలని కూటమి ప్రభుత్వం ఇప్పటికే తన శ్రేణులన్నింటికీ సంకేతాలు ఇచ్చింది. సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ముఖ్య నేతలందరికీ ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి టీడీపీ బలపరిచిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలిచి తీరాల్సిందేనని పట్టుదలతో ఉంది. నోటిఫికేషన్ జారీ కాకముందే నియోజకవర్గాల వారీగా ఒక విడత పార్టీ కేడర్, నేతలతో రాజశేఖర్ మమేకమయ్యారు. ఎట్టి పరిస్థితుల్లో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ పడేవారి సంఖ్య ఈసారీ ఎక్కువగా ఉంటుందని భావిస్తున్న తరుణంలో ఇప్పుడు నియోజకవర్గాల వారీగా ఓటర్లపై దృష్టి పెట్టారు. సమాంతరంగా పీడీఎఫ్ అభ్యర్థిగా దిడ్ల వీరరాఘవులు బరిలో ఉండడంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రసవత్తరంగా ఉండబోతున్నాయి.



న్యాయవాదికి కొల్లేరు పరిస్థితులను వివరిస్తున్న ఎంపీ పుట్టా, ఎమ్మెల్యే జయమంగళ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని

ఢిల్లీకి కొల్లేరు సమస్య

- ఎంపీ పుట్టా మహేశ్ ఆధ్వర్యంలో న్యాయపోరాటం
- సుప్రీంకోర్టులో వాదనలు వినిపించేందుకు సిద్ధమైన కొల్లేరు పరిరక్షణ సంఘం

కైకలూరు/ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కొల్లేరులో జిరాయితీ, సొసైటీ భూములను తిరిగి ప్రజలకు ఇప్పించేలా న్యాయపోరాటం చేస్తామని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ ఇచ్చిన హామీ మేరకు కొల్లేరు పంచాయితీ ఢిల్లీకి చేరింది. కొల్లేరులో అక్రమ చెరువులపై గతంలో సుప్రీంకోర్టులో మృత్యుంజయరావు అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో కొల్లేరులో ఇటీవల అటవీశాఖ అధికారులు ఆక్రమణలను తొలగించారు. సొసైటీ, జిరాయితీ భూములను కాంటూరు సరిహద్దులను దాటి ధ్వంసం చేశారు. దీనిపై గతనెల 25న కైకలూరులో కొల్లేరు ప్రజల ఐక్యత సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఇచ్చిన హామీ మేరకు ఎంపీ సుప్రీంకోర్టులో పోరాటం చేసేందుకు జిల్లా కొల్లేరు సంఘ నాయకులతో కలిసి మంగళవారం ఢిల్లీలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నాగేశ్వరరెడ్డిని కలిశారు. కొల్లేరు ప్రాంతంలో ధ్వంసం చేసిన 15 వేల ఎకరాల జిరాయితీ భూములు వెనక్కి ఇవ్వడంపై రిట్ పిటిషన్‌ను దాఖలు చేశారు. సర్వే నెంబర్ల ఆధారంగా కాంటూరు సరిహద్దు నిర్ణయించకుండా 77వేల ఎకరాల్లో ఇష్టానుసరంగా చేపట్టిన విధ్వంసంపై న్యాయస్థానంలో వాదనాలు వినిపించాలని కోరారు. కొల్లేరు సమస్యపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనాలు పంపించడానికి ప్రభుత్వం అంగీకరించినట్టు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం కొల్లేరు ప్రాంత ప్రజల పొట్ట కొట్టిందని ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ వెళ్లిన వారిలో టీడీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, కొల్లేరు ప్రజల పరిరక్షణ సంఘం ప్రతినిధులు బలే ఏసురాజు, సైదు సత్యనారాయణ, నంబూరి శివాజీ, కొల్లి వరప్రసాద్, ఘంటసాల మహాలక్ష్మీరాజు, బీకేఎం నాని, తదితరులు ఉన్నారు.

పీఠం చేజారకుండా..!

- జనసేనలోకి చైర్‌పర్సన్ వర్గం ?
- కుదరకుంటే రాజీనామా యోచన
- నూజివీడు మునిసిపాలిటీలో శరవేగంగా మారుతున్న రాజకీయ సమీకరణలు

నూజివీడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు పురపాలకంలో పాలన తిరగబడింది. నిన్నటి వరకు వైసీపీ ఖాతాలో ఉన్న నూజివీడు మునిసిపాలిటీ సోమవారం జరిగిన వైస్‌చైర్మన్ ఎంపికతో బలాలు తారుమారై టీడీపీ అభ్యర్థి అనూహ్యంగా గెలవడమే కాక కౌన్సిల్‌లో తెలుగుదేశం బలం పెరిగి చైర్‌పర్సన్ పదవిని సైతం దక్కించుకునే అవకాశం వచ్చింది. నూజివీడు చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే కౌన్సిల్ ఏర్పడి నాలుగేళ్లు పూర్తయి ఉండాలి. ఈ గడువు ముగియడానికి మరో నెలరోజులు సమయం ఉంది. దీంతో ఎలాగైనా కుర్చీని కాపాడుకోవడానికి చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ, ఆమె భర్త నూజివీడు మాజీ వైస్ చైర్మన్, కోఆప్షన్ సభ్యుడు, రామిశెట్టి మురళీకృష్ణ ప్రయత్నాలు ప్రారంభించినట్టు సమాచారం. వీరికి మాజీ



ప్రభుత్వ విప్, జనసేన నాయకుడు సామినేని ఉదయభానుతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దీంతో ఆయన సహకారంతో వైసీపీ నుంచి జనసేనలోకి తనతో మిగిలిన కౌన్సిలర్లతో వెళ్లే యోచనలో మురళీకృష్ణ వర్గం ఉన్నట్టు సమాచారం. పట్టణంలో వైసీపీకి వెన్నుదన్నుగా ఉన్న ఒక సామాజిక వర్గం ఓట్లు తాజా సార్వ త్రిక ఎన్నికల్లో పవన్ ప్రభావంతో తొలిసారిగా నూజివీడులో టీడీపీకి మంచి మెజార్టీ వచ్చిం ది. దీనిని సాకుగా చూపి ఏడాది తర్వాత జరగనున్న పురపాలక ఎన్నికల్లో జన సేన సొంత బలంతో పట్టణంలో గణనీయమైన సంఖ్యలో వార్డులు, తద్వారా చైర్మన్ పదవి చేజిక్కించు కోవచ్చు న్న యోచనలో స్థానిక జనసేన నాయకత్వం, చైర్‌పర్సన్ వర్గం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

కుదరకపోతే రాజీనామా?!

ఒకవేళ ఈ ప్రయత్నాలన్ని విఫలమై అవిశ్వాసం ఎదుర్కొవాల్సి వస్తే ముందే రాజీనామా చేయడానికి చైర్‌పర్సన్ వర్గం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. చైర్‌పర్సన్ రాజీనామా చేస్తే నోటిఫికేషన్ రావడానికి నెలలు పడుతుంది. అదే అవిశ్వాసం ఎదుర్కొని ఓడిపోతే వెంటనే మరొకరికి పదవి దక్కే అవకాశం ఉంది. పురపాలక ఎన్నికలకు ఇంకా 13 నెలల ఉంది. దీంతో రాజీనామా చేస్తే తిరిగి చైర్మన్‌ను వెంటనే ఎన్నుకునే అవకాశం ఉండదు. ఈ దిశగా ప్రస్తుత చైర్‌పర్సన్ వర్గం పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది.

ఉపాధిలో శ్రమశక్తి సంఘాలు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో శ్రమశక్తి సంఘాల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు కూటమి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వం హయంలో 50 కుటుంబాలకు సంబంధించిన జాబ్‌కార్డులకు ఒక మేట్ ఉండేవారు. ప్రస్తుతం శ్రమశక్తి సంఘాల ఏర్పాటుతో సగటున 20 జాబ్ కార్డుల్లోని 40 మందికి ఒక మేట్‌ను నియమించి పనులను పర్యవేక్షించనున్నారు. ఈ వ్యవస్థలో ప్రతిమేట్‌కు ప్రోత్సాహకం అందించనున్నారు. క్షేత్ర సహాయకుడు శ్రమశక్తి సంఘాల్లోని వేతనదారులకు మధ్య అను సంధాన కర్తగా శ్రమమిత్రలు వ్యవహరి స్తారు. ఈ క్రమంలో మళ్ళీ మేట్‌ల సంఖ్య పెరగ నుంది. ఏపీడీ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ ఈనెలాఖరు నాటికి పూర్తి కానుంది. క్షేత్ర సాంకేతిక సహాయకుల పర్యవేక్షణలో నూతన విధానం అమలు కానుంది. జిల్లావ్యాప్తంగా 3,08,110 కుటుంబాలకు జాబ్‌కార్డులు ఉండగా, 3 లక్షలకు పైగా వేతనదారులు ఉపాధి పనులు చేస్తున్నారు. 'ప్రభుత్వ మార్గదర్శకాలతో శ్రమశక్తి సంఘాలు ఏర్పాటు అవుతున్నాయి. ఈ సంఘాలతో ఉపాధి పనుల పై పర్యవేక్షణ పెరుగుతుంది. సమయ పాలనతో పాటు వేతనదారులకు గిట్టుబాటు వేతనం లభించడానికి అవకాశం ఉంటుందని ఏలూరు ఎన్ఆర్ ఈజీఎస్ ఏపీవో హమీద్‌బాషా తెలిపారు.



కొత్తగా నిర్మించిన విజిటర్ బ్లాక్

భీమవరం రైల్వేస్టేషన్‌కు కొత్త కళ

రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు

భీమవరం క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రైల్వే డివిజన్‌లో ఎంతో పేరుపొందిన భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ టాప్-5లో ఉంది. కొంత కాలం క్రితం కేంద్ర ప్రభుత్వం అమృత్ రైల్వేస్టేషన్ పనుల్లో భాగంగా భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ. 40 కోట్లను మంజూరు చేశారు. దీంతో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. రైల్వే స్టేషన్ ముఖద్వారాన్ని మొత్తం మార్పు చేస్తున్నారు. 12 మీటర్ల వెడల్పుతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. ప్లాట్‌ఫామ్ నంబర్ 1పై మొత్తం ఫ్లోరింగ్‌ను గ్రానైట్ రాళ్ళతో మారుస్తున్నారు. దాంతోపాటు దివ్యాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేసి బయటి నుంచి టిక్కెట్ కౌంటర్ వరకు, టిక్కెట్ కౌంటర్ నుంచి ప్లాట్‌ఫాం వరకు వీల్ చూర్లు వెళ్ళే విధంగా మారుస్తున్నారు. ప్లాట్‌ఫామ్ నెంబర్ 1పై కొత్తగా ఏసీ వెయిటింగ్ హాల్ నిర్మిస్తున్నారు. ప్లాట్‌ఫామ్ నెంబర్-2పై మోడ్రన్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ముఖద్వారం వద్ద ఉన్న ఆటోలు, కార్లు పార్కింగ్‌ను కొంత దూరంలో పెట్టే విధంగా ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రోజు వేలల్లో ప్రయాణికులు

టౌన్ రైల్వేస్టేషన్‌కు రోజుకు సుమారు 10 వేల నుంచి 15 వేల మంది వరకు ప్రయాణికులు ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు. నెలకు టౌన్ రైల్వే స్టేషన్ ఆదాయం సుమారు కోటి రూపాయల వరకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అలాగే జంక్షన్ రైల్వే స్టేషన్‌లో కూడా నెలకు రూ. 50 లక్షల వరకు ఆదాయం ఉంటుందని అధికారులు తెలిపారు. ఉండి రోడ్డు నుంచి టౌన్ రైల్వే స్టేషన్‌కు వెళ్ళే రహదారిలో ఇరువైపులా వాహనాల పార్కింగ్ వల్ల స్టేషన్‌కు వెళ్ళే ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే శాఖలో ఉండటంతో రైల్వే పోలీసులు కనీసం అటువైపు చూడకపోవడంతో రద్దీగా ఉన్న సమయంలో వాహనాలు ట్రాఫిక్‌లో నిలిచిపోతున్నాయి. ట్రాఫిక్ రద్దీని రైల్వే పోలీసులు క్రమబద్ధీకరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నూతనంగా నిర్మించిన భవనం.. ప్లాట్‌ఫాంపై పనులు చేస్తున్న దృశ్యం





లంకపాకల కొండరెడ్డి గ్రామంలో పురివిప్పి నాట్యమాడుతున్న నెమలి

నాట్య మయూరం..

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : అనుకోని అతిథి ఇంటి కొస్తే కుటుంబ సభ్యులు ఎంతగా ఆనందిస్తారో తెలియనిది కాదు. మంగళవారం ఉదయం ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలంలోని అంకపాకల కొండరెడ్డి గ్రామంలో నెమలి ప్రత్యక్షమైంది. నెమలిని చూసిన గ్రామస్తులంతా మంత్ర ముగ్ధులయ్యారు. మంగళవారం తెల్లవారుతుండగా మగ నెమలి గ్రామంలో ప్రత్యక్షమై నాట్యం చేయడంతో గ్రామస్థులంతా ఆనందంతో పరవశించిపోయారు. చిన్ననాటి నుంచీ ఏదో ఒక సందర్భంలో నెమలి తమ గ్రామానికి వచ్చి వెళ్లడం చూస్తున్నానని గ్రామస్థుడు కారం రాఘవ పేర్కొన్నారు. ఉదయం వచ్చిన నెమలి సాయంత్రం వరకు గ్రామంలోనే ఉంది. నెమలి తమ గ్రామానికి వచ్చి వెళ్ళడం అదృష్టంగా భావిస్తున్నామని, ఒక్కోసారి ఆడ నెమలితో కలిసి వస్తుందని తెలిపారు.



పాలకోడేరులో ఉత్తర దిశగా ప్రయాణం చేసే గోస్తనీ నది .. వేంకటేశ్వరస్వామి ఆలయం

పుణ్య నదికి ఏమి గతి ?

మురికికూపంగా గోస్తనీ నది

7 నుంచి తీర్థోత్సవాలు

పాలకోడేరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు ఎంతో ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రం.. అక్కడి నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తే జీవితం ధన్యమవుతుందని భావిస్తూ ఉండేవారు. కాశీ తర్వాత మరో కాశీగా పిలిచేవారు. పరమ పవిత్ర క్షేత్రంగా విరాజిల్లిన ఈ ప్రదేశం నేడు ముక్కు మూసుకునే పరిస్థితికి వచ్చింది.కాశీలోనే ఉత్తర దిశగా ప్రయాణం చేసే నది ఉంటుంది. పాలకోడేరు గ్రామంలోని ఉత్తర దిశగా ప్రయాణం చేసే గోస్తనీ నదిని పవిత్ర పుణ్యక్షేత్రంగా భావించి పుణ్యస్నానాలు ఆచరించేవారు. మహాత్మాగాంధీ చితాభస్మాన్ని ఈ నదిలోనే కలిపారంటే ఎంత పవిత్రమైందో అర్థమవుతుంది. నేడు అంత పవిత్రమైన పుణ్యనది మురికికూపంగా తయారైంది. మోగల్లు గ్రామా నికి మూడువైపులా ఈ నది ప్రవహిస్తుంటుంది. ఉత్తరముగా ప్రవహించిన చోటనే మోద్గల్య మహర్షి తపస్సు చేయడంతో మోద్గల్యపురమని పిలిచేవారు. కాలక్రమేణా అది మోగల్లుగా మారింది.

మూడు రోజుల పాటు ఉత్సవాలు

గోస్తనీ నది తీర్థోత్సవం అంటే ఒకప్పుడు జిల్లాలోనే మంచిపేరు. కాశీ వెళ్ళలేనివారంతా మరో దక్షిణ కాశీగా భావించి ఈ గోస్తనీ నదిలోనే పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకునేవారు. ఈ నెల 7వ తేదీ నుంచి మూడు రోజులపాటు 94వ తీర్థోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. 7వ తేదీన రామాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, రాత్రి కూచిపూడి నృత్యాలు ఉంటాయి. 8వ తేదీన కోదండరామ, వెంకటేశ్వర స్వామి కల్యాణం, అన్నసమారాధన ఉంటాయన్నారు.

పూర్వ వైభవాన్ని నిలబెట్టాలి



ఒకప్పుడు పుణ్యక్షేత్రంగా భావించే గోస్తనీ నది నేడు మురికి కూపంలా తయారైంది. ఆ నదికి పూర్వవైభవం వచ్చినప్పుడే ఈ ప్రాంతానికి పూర్వవైభవం వస్తుంది.

-గాదిరాజు బాబు, పాలకోడేరు





భీమవరం మావుళ్లమ్మ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం బాలనాగమ్మ నాటకం ప్రదర్శించారు..ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో విచ్చేసి వీక్షించారు..

ఈజీ మనీ కోసం నేడు యువత వెంపర్లాడుతున్నారు. కాలు కదపకుండా డబ్బు సంపాదించడానికి తహతహలాడుతున్నారు. ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసలవుతూ లక్షల్లో సొమ్ములు పోగొట్టుకొని అప్పులు పాలవుతున్నారు. నేడు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటోంది.. ఇంటర్‌నెట్ కూడా ఇంట్లోకి వచ్చింది.. కాలేజీ విద్యార్థులు, చిరు ఉద్యోగులు, చిరు వ్యాపారులు ఎక్కువగా ఆన్‌లైన్ గేమ్స్‌కు ఆకర్షితులై వ్యసనాల బారినపడుతున్నారు. అప్పులపాలై తీర్చేదారిలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు

-నిడమర్రు (ఆంధ్రజ్యోతి)



మాయా జూదం

- ఆకర్షిస్తున్న ఆన్‌లైన్ గేమ్స్
- బానిసలవుతున్న యువత, చిరు వ్యాపారులు
- రోజంతా స్మార్ట్ ఫోన్లతో కాలక్షేపం
- ఈజీ మనీ కోసం ఆరాటం
- లక్షలు పోగొట్టుకొని అప్పులపాలు
- అవి తీర్చలేక ఆత్మహత్యలు

భీమవరం పరిసర ప్రాంతానికి చెందిన ఓ ప్రముఖ పూజా సామగ్రి షాపు నిత్యం వ్యాపారం పచ్చతోరణంగా ఉంటుంది. రోజూ షాపు కౌంటర్ 50 వేల నుంచి లక్ష రూపాయల వరకు అమ్మకాలు సాగిస్తుంటారు. స్నేహితుల ప్రభావంతో ఆ షాపు యజమాని కుమారుడికి ఆన్‌లైన్ గేమింగ్ అలవాటైంది. ఇటీవల కాలంలో తన తండ్రి వ్యాపార నిమిత్తం బ్యాంకులో జమ వేయమని చెప్పిన సొమ్ము 10 లక్షల రూపాయలు ఆన్‌లైన్ గేమింగ్‌లో పెట్టడంతో ఆ సొమ్ము మొత్తం గల్లంతైంది. ఈ విషయంలో తండ్రీకొడుకుల మధ్య గొడవలు మొదలవ్వడంతో చివరకు కుమారుడు ఆత్మహత్య చేసుకొన్నాడు.

నిడమర్రు గ్రామానికి చెందిన ఓ ఆక్వా రైతు కొడుకు ఓ రోజు ఇంటి నుంచి ఎవరికీ చెప్పపెట్టకుండా విజయవాడ వెళ్లిపోయాడు. మూడు రోజులపాటు అందరినీ విచారించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. చివరికి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలిసులు విచారణ చేయగా ఆ కుర్రాడు విజయవాడలో ఉన్నట్లు ఇన్‌స్టాగ్రాం అకౌంట్ ద్వారా తేలింది. సంగతేంటని మెల్లగా ఆరా తీయగా ఆన్‌లైన్ గేమ్‌లలో చాలా డబ్బు పోగొట్టానని, దాని కోసం 6 లక్షల వరకు అప్పులు చేయాల్సి వచ్చిందని బోరున విలపించాడు. పోలీసులు, తల్లిదండ్రులు ఆ కుర్రాడికి నచ్చచెప్పి ఇంటికి తీసుకొచ్చారు.

గేమ్‌లోకి వచ్చేలా ఎర వేస్తారు

రమ్మీ, విన్‌జో, ఎంపిఎల్, లూడో ఎంపైర్, జూపీ, జంగిల్ రమ్మీ, డ్రీమ్ 11, గేమీ,ర గెట్ మెగా, ఎ23, అడ్డా 52, గేమీజీ, క్యూడో, వీల్ ఆఫ్ పాంక్యూన్, రమ్మీ కల్చర్ వంటి ఆన్‌లైన్ గేమ్‌లు యువతను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. ఒక్కసారి ఆ గేమ్‌ల జోలికి వెళ్లామా తిరిగి వెనక్కి వచ్చే పరిస్థితి ఉండదు. కొత్త ఖాతాదారులకు ఆదిలో కొంత డబ్బులు ఎరజూపి ఆ తర్వాత వారి ప్రతాపం చూపెడుతున్నారు. ముందు వేలల్లో లాభం చూపించి తర్వాత యువత నుంచి లక్షల్లో కొల్లగొడుతున్నారు. స్మార్ట్ ఫోన్‌లో నెట్ ఆన్ చేస్తే చాలు ప్రకటనలతో చిరువ్యాపారులను కూడా దారి మళ్లిస్తున్నారు. పండ్ల వర్తకందారులు, చెప్పుల షాపువాళ్లు, బట్టల దుకాణాల్లో పనివాళ్ళు, సెలూన్ షాపులో కుర్రాళ్లు, ఇంటర్ నెట్ సెంటర్ నిర్వాహకులు సైతం ఈ ఆన్‌లైన్ గేమ్‌ల ఉచ్చులో పడి లక్షలు పోగొట్టుకొంటున్నారు.



చేతిలో ఫోన్ ఉంటే చాలు..

ఆన్‌లైన్‌గేమ్ అన్నింటిలోనూ ప్రధానమైనమైనది రమ్మీ గేమ్ (పేకాట). పూర్వం పేకాట ఆడాలంటే ఊరిలో కుర్రాళ్ళు గానీ, పెద్దలు గానీ చాటుమాటుగా ఊరికి దూరంగా పోయి ఆడుకొనేవారు. నేడు ఆన్‌లైన్ గేమ్‌ల పుణ్యమా అని నట్టింట్లోనే స్మార్ట్ ఫోన్‌లో ఆడేస్తున్నారు. తల్లిదండ్రుల కళ్లు కప్పి రమ్మీ గేమ్‌లు ఆడుకొంటూ బంగారం లాంటి భవిష్యత్తును అంధకారం చేసుకొంటున్నారు. ఆన్‌లైన్ గేమ్‌లకు మూలం స్మార్ట్‌ఫోన్‌లే. నేడు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటోంది. మంచికి వాడుతున్నారో, చెడు వ్యసనాలకు వాడుతున్నారో తల్లిదండ్రులు తెలుసుకోవాలి

బానిసలవుతున్న చిరు వ్యాపారులు

ఆన్‌లైన్ గేమింగ్‌లకు చిరువ్యాపారులు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. చదువు పూర్తయినా ఉద్యోగం దొరక్క పోవడంతో ఎక్కడో అప్పుతెచ్చి తల్లిదండ్రులు తమ పిల్లల చేత జ్యూస్ సెంటర్, ఇంటర్‌నెట్ సెంటర్, పాలవ్యాపారం, కిరణా, రేడీమేట్ వస్త్ర దుకాణం వంటి వ్యాపారాలు పెట్టిస్తున్నారు. కరోనా కాలం నుంచి వ్యాపారాలు సరిగా లేకపోవడంతో షాపులో కూర్చొన్న యువత ఆన్‌లైన్ గేమింగ్‌లకు అలవాటు పడ్డారు. మొదట్లో సరదాగా అంటూ దిగిన కుర్రాళ్ళు తర్వాత బానిసలవుతున్నారు. ఉదయం షాపులు తీసిన మొదలు ఈ రోజు ఏ గేమ్‌లో ఎంత సంపాదించావు..? ఎంత పోయింది అన్న చర్చలే వీరి మధ్య ప్రధాన సంభాషణ జరుగుతుంది.

ఈజీ మనీ కోసం ఆరాటం

క్షణాల్లో లక్షాధికారులై పోవాలనే దురాశతో చాలామంది తమ జీవితాలను చిన్నాభిన్నం చేసుకొంటున్నారు. ఈజీ మనీ కోసం ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ డబ్బు పోగొట్టుకొంటున్నారు. యువత ఈ మాయాజాలం ఉచ్చులో పడి గిలగిల్లాడుతున్నారు. ముఖ్యంగా నిరుద్యోగ యువత, చిరువ్యాపారులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఈ మాయలో పడి అప్పులు పాలవుతున్నారంటే ఆశ్చర్యం వేస్తుంది. బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టడం, బైక్‌లు, ఖరీదైన సెల్‌ఫోన్‌లు కూడా తాకట్టుపెట్టి జూదం ఆడుతున్నారు. కుటుంబ సభ్యులకు అబద్ధాలు చెప్పి మరీ డబ్బులు గుంజుకొని జూదం ఆడుతున్నారు. ఆన్‌లైన్ గేమ్‌లపై అవగాహన లేకపోవడంతో వయసుతో సంబంధం లేకుండా అందరూ డబ్బులు పోగొట్టుకొంటున్నారు.

అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు

లక్షల్లో అప్పులు చేసి ఆన్‌లైన్ గేమ్‌లు ఆడి సొమ్ములు పోగొట్టుకొంటున్న వారు అప్పుల ద్వారా జీవితాన్ని కుటుంబాన్ని నెట్టు కొస్తున్నారు. స్థాయికి మించి అప్పులు చేసి తీర్చే మార్గం లేక ఊరు విడిచి పారిపోవడమో, ఆత్మహత్యలు చేసుకోవడం వంటి సంఘ టనలు నేడు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ జరుగుతున్నాయి.

- **పెద్దవాళ్లు గమనిస్తూ ఉండాలి**



నేడు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటోంది. ఇంటర్‌నెట్ సదుపాయం ద్వారా విద్యార్థులు చెడు వ్యవసనాల పట్ల ఆకర్షిలవుతున్నారు. ఆన్‌లైన్‌లో జూదాల్లో లక్షల్లో సొమ్ములు పోగొట్టుకొం టున్నారు. ముఖ్యంగా చదువుకొనే విద్యార్థులు తమ స్మార్ట్ ఫోన్ సక్రమంగా ఉపయోగించుకోవాలి. ఇళ్లల్లో పెద్దలు కూడా తమ పిల్లల భవిష్యత్తు దృష్ట్యా వారి అలవాట్లను గమనిస్తూ వారిని సరైన బాటలో వెళ్లేలా చూసుకోవాలి.

- కాళ్లకూరి సత్యనారాయణమూర్తి, రిటైర్డు ప్రిన్స్‌పాల్, లయన్స్‌క్లబ్ పూర్వ అధ్యక్షుడు, గణపవరం

- **విలువైన కాలం, జీవితం నాశనం**



ఇటీవల కాలంలో యువత ఆన్‌లైన్ గేమ్‌ల పట్ల ఆకర్షితులై దానికి బానిసలవుతున్నారు. సెల్‌ఫోన్‌లో ఇంటర్‌నెట్ ద్వారా విలువైన విజ్ఞానం పొందవచ్చు.కొంత మంది యువకులు, చిరు వ్యాపారులు,ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసలవుతున్నారు. తమ విలువైన కాలాన్ని, జీవితాలను నాశనం చేసుకొంటున్నారు.సరదాగా ఆడుతున్న జూదం తర్వాత వ్యవసంగా మారుతోంది. తల్లిదండ్రులు కూడా దృష్టి పెట్టాలి.. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

- ఎంవీ సుభాష్ సీఐ, నిడమర్రు



సూర్యప్రభ వాహనంపై సర్వాంతర్యామి

రథసప్తమి వేళ ఊరేగిన శ్రీవారు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సప్త అశ్వాలను అధిరోహించి సూర్యప్రభ వాహనంపై ఉభయ దేవేరులతో కొలువుతీరిన చినవెంకన్న క్షేత్ర పురవీథుల్లో విహరించారు. సాయం సమయంలో చంద్రప్రభపై తిరు వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. రథసప్తమి పురస్కరించుకుని మంగళవారం ఉదయం, రాత్రి వేళల్లో జరిగిన ఈ వాహనసేవలు భక్తజనులకు నేత్ర పర్వమయ్యాయి. ఉదయం సూర్య ప్రభవాహనం, సాయంత్రం చంద్రప్రభపై స్వామి, అమ్మవార్లను ఉంచి విశేష పూజలు జరిపి హారతులు సమర్పించారు. అనంతరం అర్చకుల వేదమంత్రోచ్చరణలు, భక్తుల గోవిందనామ స్మరణలు, మేళతాళాల నడుమ శ్రీవారు తిరు వీధుల్లో ఊరేగారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు హారతులు పట్టారు.



గాలాయగూడెంలో శివుడిపై సూర్య కిరణాలు

దెందులూరు ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) దెందులూరు మండలం గాలాయగూడెం శివాలయంలో అద్భుతం జరిగింది. మంగళవారం ఉదయం 6.30 సమ యంలో భీమ నాగలింగేశ్వరస్వామి ఆలయంలో శివ లింగంపై సూర్యకిరణాలు ప్రసరించాయి. గ్రామస్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. 30 సంవత్సరాలకు ఒక్కసారి మాత్రమే ఇలా జరుగుతుందిని గ్రామస్థులు చెబుతున్నారు.

ముస్తాబైన అంతర్వేది లక్ష్మీనరసింహుడు

వైభవంగా ప్రారంభమైన కల్యాణోత్సవాలు

పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తెగా స్వామి, అమ్మవార్లకు అలంకరణ

అంతర్వేది, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు రథసప్తమి రోజున వైభవంగా ప్రారంభమయ్యాయి. వార్షికంగా బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబీకులు తొలి పూజలు చేశారు. ఆలయ స్థానాచార్యుడు వింజమూరి రామరంగాచార్యులు సమక్షంలో ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాసారాచార్యులు ఆధ్వర్యంలో శ్రీవారికి వైష్ణవ సంప్రదాయం ప్రకారం పూజలు జరిగాయి. ఉదయం సుప్రభాత సేవ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనం తరం శ్రీస్వామి వారి రథానికి పూజలు చేశారు. గంటలు మోగగా భక్తులు గోవింద నామస్మరణతో రథాన్ని లాగి ఉత్సవాలను ప్రారంభించారు. పల్లిపాలెం గ్రామానికి చెందిన వాహనకారులు, గ్రామస్తులు, భక్తులు రథాన్ని మెరక వీధి (రాజా వారి వీధి)కి చేర్చారు. సాయంత్రం లక్ష్మీనరసింహస్వామివారిని పెండ్లి కొడుకుగాను, అమ్మవారిని పెండ్లి కుమార్తెగాను అలంక రించారు. అర్చకుల వేద మంత్రోచ్చరణల నడుమ నీలమేఘశ్యాముడైన స్వామివారికి బుగ్గన చుక్క పెట్టడంతో పెండ్లి కొడుకుగా దర్శనమిచ్చారు. వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి-అమ్మవార్లకు బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబీకులు ఉంగరాలను సమర్పించారు. ఉభయ కుటుంబాలకు చెందిన ఆడపడుచులు స్వామి, అమ్మవార్లకు హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఆలయ సహాయ కమిషనరు వి.సత్యానారాయణ, ఆలయ ఫ్యామిలీ ఫౌండర్, చైర్మన్ రాజా కలిదిండి కుమార రామ గోపాలరాజా బహదూర్, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

సూర్య, చంద్ర ప్రభ వాహనాలపై స్వామివారి గ్రామోత్సవం

కల్యాణోత్సవాల్లో తొలిరోజైన మంగళవారం ఉదయం లక్ష్మీనరసింహుడు సూర్య వాహనంపై పురవీధుల్లో విహరించగా భక్తులు హారతులు పట్టారు. రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా జరిగింది.

అంతర్వేదికి 35 బస్సులు

భీమవరం టౌన్,ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి కల్యాణాన్ని పురస్కరించుకుని ఈ నెల 7, 8 తేదీల్లో జిల్లాలోని నాలుగు డిపోల నుంచి 35 సర్వీసులను నడపాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా భీమవరం డిపో నుంచి 15 సర్వీసులు, నరసాపురం నుంచి 10, తణుకు నుంచి 5, తాడేపల్లిగూడెం నుంచి 5 సర్వీసులను నడపాలని నిర్ణయించారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలు అందాయి. ప్రతి డిపోలోను 7వ తేదీ ఉదయం నుంచి బస్సులను నడిపే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు. భీమవరం బస్సు కాంప్లెక్స్ నుంచి ఉదయం 8.30 గంటల నుంచి ప్రతి అరగంటకు ఒక బస్సు చొప్పున నడపనున్నారు. మలికిపురం వరకు మాత్రమే ఈ సర్వీసులు నడుస్తాయి. అక్కడి నుంచి అంతర్వేది వెళ్ళేందుకు రాజోలు డిపో ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వీసుల ద్వారా పంపనున్నారు.



రాజావారి వీధికి రథాన్ని తీసుకువస్తున్న భక్తులు

భక్తుల సముద్ర స్నానాలు

రథ సప్తమిని పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాకార మండపంలో ఉదయం అధిక సంఖ్యలో మహిళలు సూర్యనమస్కారాలు చేశారు. క్యూలైన్లలో భక్తులకు ఉత్సవ సేవకులు, పోలీసులు సేవలు అందించారు.

పాలన ఎలా ఉంది?



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

- టీడీపీ ఇన్‌చార్జిల తీరుపై ఐవీఆర్‌లో అధిష్ఠానం ఆరా
- తెలుగుదేశం శ్రేణుల ఆసక్తి

తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జిల పనితీరు, పాలనపై అధిష్ఠానం ఆరా తీస్తోంది. కూటమి భాగస్వామ్య పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నచోట టీడీపీ ఇన్‌చార్జిలు ఉన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 15 నియోజకవర్గాలను గడచిన ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి కైవసం చేసుకుంది. భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, ఉంగుటూరు, పోలవరం, నిడదవోలు నియోజకవర్గాల్లో కూటమి తరఫున జనసేన ఎమ్మెల్యేలు ఉన్నారు. ఆరు చోట్ల తెలుగుదేశం పార్టీకి ఇన్‌చార్జ్‌లు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పార్టీ కేడర్‌ను కాపాడుకోవాలంటూ ఎప్పటికప్పుడు అధిష్ఠానం దిశానిర్దేశం చేస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావడంతో పాలన, ఇన్‌చార్జిల పనితీరుపై అధిష్ఠానం దృష్టి పెట్టింది. ఐవీఆర్ కాల్స్ ద్వారా ప్రజల స్పందన తెలుసుకుంటోంది. తెలుగుదేశం కేడర్‌తోపాటు అన్ని వర్గాల ప్రజలకు ఐవీఆర్ కాల్స్ వచ్చాయి. ఇన్‌చార్జ్‌ల పాలన ఎల ఉందని ప్రశ్నించి బాగాలేదు, పరవాలేదు, బాగుంది అంటూ 3 ఆప్షన్‌లు ఇచ్చారు. ఒక ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలని సూచించారు, ఇటీవల ఎమ్మెల్యేల పనితీరుపైనా కూటమి ప్రభుత్వం ఆరా తీసింది. తాజాగా ఇన్‌చార్జ్‌ల పనితీరుపై దృష్టి పెట్టింది.

ఇంటెలిజెన్స్ నివేదికలు

ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల పనితీరుపై ఎప్పటికప్పుడు ఇంటెలిజెన్స్ విభాగం వివరాలు చేరవేస్తోంది. తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం కూడా నియోజకవర్గాల్లో పరిస్థితులపై దృష్టి పెట్టింది. ఇటీవల జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో సెటిలమెంట్‌లు అధికంగా ఉంటున్నాయి. వాటిలో ముఖ్యపాత్ర పోషిస్తున్న వారిపై అధిష్ఠానం వద్ద నివేదికలున్నాయి. నియోజకవర్గాల్లోనూ ఈ దందాపై చర్చ సాగుతోంది. వారి ప్రభావం ఎమ్మెల్యేల పనితీరుపైనా ప్రభావం చూపుతోంది. అధిష్ఠానం వద్ద నెగటివ్ మార్కులు పడుతున్నాయని నియోజకవర్గ కేడర్‌లో చర్చ జరుగుతోంది. ఐవీఆర్ కాల్స్ ద్వారా ప్రజల నుంచి కూడా అదే రకమైన స్పందన వస్తోందని పార్టీ కార్యాలయాల నుంచి సంకేతాలు వస్తున్నాయి. మొత్తంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేల పనితీరును అధిష్ఠానం నిశితంగా గమనిస్తోంది.

ఎమ్మెల్సీ ఎన్నిక: రెండో రోజు రెండో నామినేషన్



కలెక్టర్ వెట్రిసెల్వికి నామినేషన్ సమర్పిస్తున్న శ్రీనివాస్

ఏలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండో రోజు మంగళవారం రెండో నామినేషన్ దాఖలైంది. ఏలూరుకు చెందిన ములకల శ్రీనివాస్ నామినేషన్ పత్రాలను కలెక్టరేట్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వికి సమర్పించారు. ఒక సెట్ నామినేషన్ సమర్పించిన శ్రీనివాస్‌తో రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. కలెక్టర్ వెంట ఏఆర్‌వో, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు ఉన్నారు. తొలిరోజు కాకినాడకు చెందిన పేపకాయల రాజేంద్ర నామినేషన్ దాఖలు చేశారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) గ్రాడ్యుయేటు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిపై కలెక్టర్ నాగరాణి, జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి జిల్లాలో అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించకుంటే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. రాజకీయ పార్టీలు, నేతల ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, గోడ రాతలను తొలగించాలన్నారు. బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహణ, లౌడ్ స్పీకర్లకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, సచివాలయాల అధికారి వై.దోసిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

పోలవరం నిర్వాసితుల సమస్యలపై నేడు గ్రామసభ

కుక్కునూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల సమస్యలపై కుక్కునూరులో బుధవారం గ్రామసభ నిర్వహించనున్నారు. ఐటీడీఏ పీఓ రాములు నాయక్ హాజరు కానున్నారు. అన్ని ఆధారాలు ఉన్నప్పటికి చాలా మంది నిర్వాసితుల పేర్లు పునరావాస పరిహారం జాబితాలో లేవు. 18 ఏళ్లు నిండిన వారికి పునరావాస పరిహారం కట్ ఆఫ్ డేట్‌కు ముందే ఉన్న యువతల పేర్లు కూడా జాబితాలో గల్లంతయ్యాయి. తమకు న్యాయం చేయాలంటూ నిర్వాసితులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు తహసీల్దార్ కార్యాలయంలో జరిగే గ్రామసభలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ క్రమంలో నిర్వాసితుల సమస్యలపై గ్రామసభ నిర్వహించనున్నారు.

ఖైదీలకు సౌకర్యాలపై ఆరా

జిల్లా జైలును సందర్శించిన న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి



జిల్లా జైలులో ఖైదీల ఆహార పదార్థాలను రుచి చూస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఏలూరులోని జిల్లా కారాగారాన్ని మంగళవారం సందర్శించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహార, వైద్య, మంచినీరు, పరిశుభ్రత తదితర వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖైదీలతో మాట్లాడుతూ పోలీసులు అరెస్టు చేసేటప్పుడు దగ్గర బంధువులకు గాని స్నేహితులకు గాని తెలియజేయాలన్నారు. కేసు వివరాలకు సంబంధించిన పత్రాలను సంబంధిత ముద్దాయిలకు అందజేయాలని, ఇది ఖైదీల హక్కు అన్నారు. లేని పక్షంలో సంబంధిత మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలియజేశారు. అలాగే అవసరమైన ఖైదీలకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేసి, న్యాయ సహాయం అందిస్తుందని ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట కారాగారం సూపరింటెండెంట్ సీహెచ్‌ఆర్ వి స్వామి, జైలర్లు వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ కోడిపై వైరస్ దాడి





పౌల్ట్రీ పరిశ్రమపై వైరస్ దాడి చేసింది. వైరస్ కారణంగా లక్షల్లో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. గత డిసెంబరులో వైరస్ వ్యాప్తితో కోళ్లు చనిపోతునే ఉన్నాయి. మరింత విజృంభించడంతో పౌల్ట్రీ పరిశ్రమ సంక్షోభంలో చిక్కుకుంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 30 లక్షల నుంచి 40 లక్షల కోళ్లు మృత్యువాత పడినట్లు అంచనా. మరోవైపు గుడ్ల ఉత్పత్తి భారీగా తగ్గిపోయి పౌల్ట్రీ రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారు.

- అంతుచిక్కని వైరస్
- లక్షల్లో కోళ్లు మృతి
- గుడ్ల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం
- సంక్షోభంలో పౌల్ట్రీ పరిశ్రమ

తణుకు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వైరస్ దాడితో లక్షల్లో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. దీనితో గుడ్ల ఉత్పత్తి కూడా తగ్గి పౌల్ట్రీ పరిశ్రమ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది. పౌల్ట్రీ పరిశ్రమపై చలికాలంలో వైరస్ ప్రభావం ఎక్కువ. ప్రస్తుతం ఆర్‌డి వైరస్ కొత్త వేరియంట్‌తో అధిక సంఖ్యలో కోళ్లు చనిపోతున్నాయని భావిస్తున్నారు. ఈనెలాఖరు వరకు వైరస్ ప్రభావం ఉంటుందని, వేసవి రాకతోనే వైరస్ తగ్గుముఖం పడుతుందని పలువురు రైతులు చెబుతున్నారు. ఏటా క్రమం తప్పకుండా పౌల్ట్రీ కోళ్లకు వాక్సిన్ వేయిస్తే వైరస్ ప్రభావం తక్కువగా ఉంటుందని సమాచారం.

తగ్గిన గుడ్ల ఉత్పత్తి

పౌల్ట్రీ పరిశ్రమపై వైరస్ దాడితో లక్షలో కోళ్లు మృత్యువాత పడడంతో అదే స్థాయిలో గుడ్ల ఉత్పత్తి పడిపోయింది. ఉమ్మడి జిల్లాలోని పౌల్ట్రీల్లో 1.7 కోట్ల కోళ్లు ఉంటే రోజుకు 1.1 కోట్ల గుడ్లు ఉత్పత్తి అయిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం రోజుకు 80 లక్షల నుంచి 90 లక్షల గుడ్లు వస్తున్నాయి. ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు తగ్గిపోయాయి. గతంలో బీహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాలకు 30 లారీల గుడ్లు ఎగుమతి అయ్యేవి. ప్రస్తుతం 12 నుంచి 15 లారీలు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి.

ఆర్థికంగా తీవ్ర నష్టం

వైరస్ వ్యాప్తితో పౌల్ట్రీ పరిశ్రమకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతుంది. 2006లో బర్డ్‌ఫ్లూ వైరస్ ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అప్పటి నష్టాలతో చాలా మంది పరిశ్రమ నుంచి ఇతర రంగాల వైపు వెళ్లిపోయారు. ప్రస్తుత వైరస్ తాకిడికి తిరిగి అదే పరిస్థితి తలెత్తింది. పెద్ద ఎత్తున కోళ్లు మృత్యువాత పడడం, వైరస్ నిరోధక చర్యలు భారం కావడం, తగ్గిన గుడ్ల ఉత్పత్తితో రైతులు నష్టపోతున్నారు.

సంరక్షణ ఇలా..

- వైరస్ దాడితో మృత్యువాత పడిన కోళ్లను బహిరంగ ప్రాంతాల్లో వదిలేస్తే వైరస్ మరింత ఉధృతమయ్యే అవకాశాలున్నాయి.
- అధిక సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడితే గొయ్యి తీసి పాతిపెట్టాలి.
- ఫారమ్ కోళ్లకు వైరస్ నిరోధ వాక్సిన్ వేస్తుంటారు. నాటుకోళ్లకు వాక్సిన్ వేస్తే వైరస్ వ్యాప్తి తగ్గుతుంది.
- పౌల్ట్రీలకు మెస్ ఫినిషింగ్ ఉంటే వైరస్ వ్యాప్తి తక్కువగా ఉంటుంది.
- జీవ సంరక్షణ విధానాలతో ఫారమ్‌లకు మేలు జరిగే అవకాశాలు ఉంటాయి.
- బలవర్ధక ఆహారం అందించే ఫారమ్‌లో వైరస్ ఉధృతి తక్కువ.

వైరస్ నిర్ధారణకు నమూనాల సేకరణ

పశుసంవర్ధక శాఖ జేడీ మురళీకృష్ణ



విలేకరులతో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ జేడీ మురళీకృష్ణ

వైరస్ దాడితో మృత్యువాత పడిన నమూనాలు సేకరించి విజయవాడ ల్యాబ్ పంపించినట్లు పశుసంవర్ధక శాఖ జేడీ మురళీకృష్ణ తెలిపారు. తణుకులోని నెక్ కార్యాలయం వద్ద మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోళ్ల ఫారలలో జీవ సంరక్షణ చర్యల ద్వారా వ్యాధులను అదుపు చేయవచ్చన్నారు. 15 రోజుల నుంచి దేశవాళీ కోళ్లు, పౌల్ట్రీ కోళ్లలో అసహజ మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. కోళ్లలో వ్యాధి నిరోధక శక్తి క్షీణించడంతో మిక్స్‌డ్ వైరస్ వ్యాధులు వ్యాపిస్తున్నాయని వివరించారు. అధిక సంఖ్యలో మృత్యువాత పడడంపై కారణాలు పరీక్షల తర్వాత తెలుస్తాయన్నారు. రైతులు వ్యాధి నివారణకు బయో సెక్యూరిటీ విధానాలు పాటించాలన్నారు. చనిపోయిన కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో గొయ్యి తీసి పూడ్చాలన్నారు. రోడ్డు పక్కన, కాలువలో పడవేయరాదన్నారు. కోళ్లకు వ్యాక్సినేషన్ క్రమం తప్పకుండా నిర్వహించాలని చెప్పారు. క్రిమి సంహారక మందులు, తాగునీటిలో వ్యాధి నిరోధక మందులు వాడడం వల్ల వ్యాధి అదుపులోకి వస్తుందన్నారు. వైరస్ మనుషులకు సోకే అవకాశం లేదన్నారు. గుడ్లు, మాంసం వినియోగించవచ్చని చెప్పారు. ఫారమ్‌లో కొంగలు, పక్షులు నివారణకు మెస్‌లు, గోడలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. జేడీతో పాటు డిప్యూటీ డైరెక్టర్లు ఎల్‌కే.సుధాకర్, వాకాణి ప్రసాద్, ఏడీలు అత్తిలి నరసింహారావు, శంకర్, పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులు కొమాట్లపల్లి వెంకట సుబ్బారావు, గుడిత గంగాధరరావు, పెనుమర్తి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ రైతుల సమస్యలు పరిష్కరించండి : సీఎంకు వినతి



ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇస్తున్న పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు సుబ్బారావు, తదితరులు

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ రైతుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లినట్లు పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, కాల్దరి గ్రామానికి చెందిన కోమట్లపల్లి వెంకట సుబ్బారావు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబును మంగళవారం విజయవాడలో సమస్యలను వివరించారు. సంక్షోభంలో ఉన్న పౌల్ట్రీ పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరినట్టు చెప్పారు. జొన్న దిగుమతి సుంకం తగ్గించాలని, బ్యాంకు రుణాలపై వడ్డీ రాయితీ ఇవ్వాలని కోరామన్నారు. సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని సుబ్బారావు చెప్పారు. టి.కుటుంబరావు, పడాల సుబ్బారెడ్డి, గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం, జి.గంగాధరరావు, పౌల్ట్రీ యజమానులు ఉన్నారు.

నగ్న చిత్రాలు నెట్‌లో పెడతానని బెదిరించి..

రూ.2.52 కోట్లు కొట్టేశాడు!

- బెదిరిపోయిన యువతి
- దఫదఫాలుగా సొమ్ము జమ
- అప్పులపాలైన కుటుంబం
- పోలీసులకు ఫిర్యాదు
- గుంటూరులో మోసగాడిని అరెస్టు చేసిన పోలీసులు
- రూ.1.81 కోట్ల విలువైన ఆస్తులు సీజ్



పోలీసులు అరెస్ట్ చేసిన నిందితుడు సాయికుమార్, స్వాధీనం చేసుకున్న నగదు, ఆభరణాలు

కొవ్వూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న యువతికి పరిచయమైన యువకుడు ఆమెను నగ్న చిత్రాలతో బెదిరించి కోట్లు కొట్టేశాడు. ఈ సంఘటన వివరాలు కొవ్వూరులో డీఎస్పీ జి.దేవకుమార్ మంగళవారం విలేకరులకు వెల్లడించారు. తమిళనాడుకు చెందిన ఒక కుటుంబం 30 ఏళ్ల క్రితం నిడదవోలులో స్థిరపడింది. వారి ఒక్కగానొక్క కుమార్తె బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ చదువుకుని హైదరాబాద్ విప్రో కంపెనీలో నాన్ ఐటీ ఉద్యోగంలో చేరింది. కూకట్‌పల్లిలోని గాయత్రి ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటుంది. హాస్టల్‌లో చిన్ననాటి స్నేహితురాలు కాజా అనూషాదేవి కలిసింది. అనూషాదేవి గుంటూరు రూరల్ ప్రాంతానికి చెందిన నినావత్ దేవనాయక్ అలియాస్ మధు సాయికుమార్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. భర్త సాయికుమార్‌ను యువతికి పరిచయం చేసింది. ముగ్గురు స్నేహంగా ఉండేవారు. 2021లో బాధిత యువతి ఉద్యోగం మానివేసి నిడదవోలు ఇంటికి వచ్చేసింది. ఆ సమయంలో సాయికుమార్ వేరెవరో ఫోన్ చేసినట్టు ఫోన్‌చేసి హాస్టల్‌లో ఉన్నప్పుడు తీసిన న్యూడ్ వీడియోస్ తన వద్ద ఉన్నాయని, నెట్‌లో పెడతానని బెదిరించి డబ్బు డిమాండ్ చేశాడు. ఈ విషయాన్ని యువతి స్నేహితుడిగా నమ్మిన సాయికుమార్‌కు చెప్పడంతో వేరొకరితో సెటిల్మెంట్ చేసినట్టు నమ్మించాడు. ఆ గొడవలో దెబ్బలు తగిలాయని ఆసుపత్రి బిల్లుకు కొంత డబ్బు కావాలని అడిగి తీసుకున్నాడు. అనంతరం గుంటూరులో బాయ్స్ హాస్టల్ పెట్టి దానిని మేనేజ్‌మెంటు చేస్తున్నట్టు కొంత డబ్బు తీసుకున్నాడు. యువతిని ఉద్యోగం కోసం కెనడా పంపిస్తానని కొంత డబ్బు తీసుకున్నాడు. అవసరం వచ్చినప్పుడల్లా డబ్బులు డిమాండ్ చేసేవాడు. డబ్బు ఇవ్వకపోతే న్యూడ్ వీడియోలు తన వద్ద ఉన్నాయని వాటిని నెట్‌లో పెడతానని బెదిరించేవాడు.

బాధిత యువతి తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారూ బెదిరిపోయారు. అమ్మాయి జీవితం పాడవుతుందని వ్యాపారంలో సంపాదించిన డబ్బుతో పాటు, ఇల్లు తాకట్టు పెట్టి, తెలిసిన వారి వద్ద కొంత అప్పు చేసి దఫదఫాలుగా 2021 నుంచి 2025 జనవరి వరకు మొత్తం రూ.2,53,76,000 బ్యాంకు, ఫోన్ పే, గూగుల్ పే ద్వారా సాయికుమార్‌కు పంపారు. ఆమె చెల్లించిన మొత్తానికి ఆధారాలు ఉన్నాయి. ప్రస్తుతం యువతి తల్లిదండ్రులు అద్దె ఇంట్లో ఉంటున్నారు. గత నెలలో మరో రూ.14 లక్షలు డిమాండ్ చేశాడు. అప్పటికే అప్పుల పాలైన వారు సొమ్ము ఇవ్వలేదు. సాయికుమార్‌పై ఈ నెల 1న నిడదవోలు పోలీస్‌స్టేషన్‌లో బాధిత యువతి ఫిర్యాదు చేసింది. ఎస్ఐ జీఎస్ఆర్‌కే పరమహంస నిందితుడు సాయికుమార్‌పై కేసు నమోదు చేశారు. ఐటీ యాక్టు ఉండడంతో నిడదవోలు సీఐ పీవీజీ. తిలక్ కేసు దర్యాప్తును ప్రారంభించారు. యువతి ఇచ్చిన ఆధారాలతో గుంటూరు జిల్లా చిన్నకాకాని చేరుకుని ఈ నెల 2న సాయికుమార్‌ని అరెస్టు చేశారు. అతడి వద్ద రూ.75 లక్షల నగదు, 938 గ్రాముల బంగారు ఆభరణాలు, 2.250 కేజీల వెండి వస్తువులు, కారు, బుల్లెట్, చిన్నకాకానిలో రూ.40 లక్షలతో కొనుగోలు చేసిన అపార్ట్‌మెంటు పత్రాలను తహసీల్దార్, రెవెన్యూ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ.1,81,45,000 ఉంటుందన్నారు. సాయికుమార్‌ను ఈ నెల 3న కోర్టులో హాజరుపరచగా జ్యుడిషియల్ రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో పూర్తిస్థాయి విచారణ చేపట్టవలసి ఉండడంతో సాయికుమార్‌ని ఐదు రోజులు పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరామన్నారు. ఈ కేసులో ఎటువంటి వీడియోలు లభ్యం కాలేదని తెలిపారు. వీడియోలు లేకపోయినప్పటికి బెదిరించి, డబ్బులు వసూలు చేసినట్టు చెప్పారు. బాధిత యువతి స్నేహితురాలు కాజా అనూషాదేవి పాత్రపై ఆధారాలు లేవన్నారు.


పనికి వెళ్లిన వ్యక్తి కాల్వలో శవమై తేలాడు

నరసాపురం టౌన్, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి పనికి వెళ్లిన వ్యక్తి నరసాపురం- నిడదవోలు పంట కాల్వలో మంగళవారం శవమై తేలాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పున్నా మి రమేష్(45) సోమవారం ఉదయం పనికి వెళతానని చెప్పి బయటకు వెళ్లాడు. సాయంత్రం ఎంత సేపటికి రాకపోవడంతో మంగళవారం ఉదయం గాలించారు. శ్రీహరిపేటలోని పెట్రోల్‌బంకు ఎదురుగా కాల్వ వద్ద చెప్పులు కనిపించాయి. అనుమానం వచ్చి కాల్వ వెంబడి గాలించగా మృతదేహం లభ్యమైంది. తల్లి అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జయలక్ష్మి తెలిపారు.

ప్రేమించిన వ్యక్తి తిడుతున్నాడని యువతి ఆత్మహత్య

భీమవరం క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన వ్యక్తి తిడుతున్నాడన్న మనస్తాపానికి గురైన యువతి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వన్ టౌన్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గునుపూడి గరువుపేటకు చెందిన బత్తిన అనూష (19) డిగ్రీ చదివి ఇంటి వద్దే ఉంటుంది. ఆమె ప్రేమించిన ఎం.సత్యనారాయణ తరచు అనూషను తిడుతున్నాడు. ఈ నెల 3న సాయంత్రం 7.30 గంటల సమయంలో అనూష- సత్యనారాయణ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. అనంతరం అనూష స్నానం చేసి గదిలోకి వెళ్లింది. రాత్రి 8.30 గంటల సమయంలో సత్యనారాయణ అనూష సోదరి కృష్ణవేణికి ఫోన్ చేసి మీ సోదరి చనిపోతానంటుంది చూడమని చెప్పాడు. అనూష గదిలోంచి బయటకు రాకపోవడంతో తలుపులు కొట్టినా తీయలేదు. దీంతో కృష్ణవేణి చుట్టుపక్కలవారిని పిలువగా వారు వచ్చి తలుపు బద్దలుకొట్టారు. అనూష ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. కిందకు దింపి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. మృతురాలి సోదరి కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిల్డ్రన్స్ హోమ్‌కు బాధిత చిన్నారులు



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్డీవో


ఏలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత చిన్నారులు రాహుల్, రేణుక ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన వెంటనే ఏలూరులోని చిల్డ్రన్స్ హోమ్‌కు పంపిస్తామని ఆర్డీవో ఎం.వి.రమణ తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆ పిల్లలు కుటుంబ సభ్యులలో ఎవరి దగ్గర ఉన్నా రక్షణ ఉండదని భావించి ప్రభుత్వ సంరక్షణలో ఉంచుతామన్నారు. పిల్లలకు సహాయం చేయడానికి దాతలు ముందుకు రావడంతో రాహుల్, రేణుక పేరిట యూనియన్ బ్యాంకులో ఖాతా ఓపెన్ చేసినట్లు చెప్పారు. దాతలు 025912010003035, ఐఎఫ్ఎస్‌సి కోడ్ యూబీఐఎన్ 0802590కు విరాళాలు ఇవ్వవచ్చని ఆర్డీవో తెలిపారు. వచ్చిన మొత్తం పిల్లల పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని, వారికి మైనారిటీ తీరిన తర్వాత అందజేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో తహసీల్దారు కె.స్లీవజోజి, సీడీపీవో పి.బ్యూలా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్టర్‌ను మోసం చేసిన మాజీ మంత్రి ఆళ్ల నాని సోదరుడు'

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆళ్ల నాని మంత్రిగా ఉండగా ఆయన సోదరుడు రోడ్ల నిర్మాణం బిల్లులు తీసేసుకుని తనను మోసం చేశారని కాంట్రాక్టర్ వేమూరి రామకృష్ణ ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడిని కలిసి వినతిపత్రం ఇవ్వడంతో జిల్లా ఎస్పీకి సీఎం రిఫర్ చేశారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటిని మంగళవారం కలిసి రామకృష్ణ వివరాలు తెలిపారు. వెంకటాపురం పంచాయతీలో తనను సబ్ కాంట్రాక్టర్‌గా నియమించి రూ.3 కోట్లు పనులు చేయించారన్నారు. తనకు కేవలం రూ.70 లక్షలు ఇచ్చి మిగిలిన సొమ్ము మాజీ మంత్రి సోదరుడిని కాంట్రాక్టర్‌గా నమోదుచేసి అతనికి ఇప్పించారన్నారు. దాదాపు రూ.2.5 కోట్లు కోట్లు నష్టపోయాయనని వాపోయారు. ప్రభుత్వం నుంచి వచ్చిన సొమ్మును తనకు ఇప్పించాలని ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే బడేటి చంటిని కోరారు.

సెల్‌ఫోన్ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ఏలూరు, పాలకొల్లులో 12 కేసుల నమోదు



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి.శ్రీరామ్‌బాబుకు ఆదేశాలతో విజిలెన్స్ అధికారులు మంగళవారం ఏలూరు, పాలకొల్లులో సెల్‌ఫోన్ దుకాణాలు తనిఖీ చేశారు. ఏలూరులోని సెల్‌టెక్ మొబైల్ షాపు, హిందుస్థాన్ మొబైల్స్ భారత్ టెలికం మొబైల్స్, పాలకొల్లు పట్టణంలోని పూజా మొబైల్ అండ్ స్పేర్ పార్ట్స్, రాందేవ్ మొబైల్స్, శ్రీ మొబైల్ షాపులను తనిఖీ చేశారు. వస్తువుల తయారీ తేదీ, తయారీ చిరునామా, ఎమ్మార్పీ, వినియోగదారు సేవా ఫోన్ నెంబర్ సమాచారం లేకుండా లైట్లు, స్పీకర్లు, సౌండ్‌బాక్స్‌లు, ఇతర మొబైల్ ఉపకరణాలను గుర్తించారు. ఈ ఆరు మొబైల్ షాపులపై తూనికలు కొలతలు చట్ట ప్రకారం 12 కేసులు నమోదు చేశారు. దాడుల్లో విజిలెన్సు ఇన్‌స్పెక్టర్లు పి.శివరామకృష్ణ, పి ప్రసాద్ కుమార్, విజిలెన్స్ ఎస్ఐ కె సీతారామ్, ఏలూరు తూనికలు కొలతల అధికారి పి ప్రశాంతకుమార్, భీమవరం తూనికలు కొలతల అధికారి టి రాంబాబు, పలువురు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలపై దాడులు సరికాదు : సీపీఎం

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీలోని ఆదివాసీ చట్టాలపై కూటమి నాయకులు దాడులు సరికాదని సీపీఎం మొడియం నాగమణి అన్నారు. మంగళవారం ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో పోలోజు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ చట్టాన్ని సవరించాలని నాయకుల వాదనలను విరమించుకోవాలని కోరారు. నెల్లూరులో జరిగిన సీపీఎం రాష్ట్ర మహాసభల్లో ఎ.రవి, మొడియం నాగమణిలను రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు తెల్లం రామకృష్ణ, అన్నపూర్ణ, కుంజా సత్యన్నారాయణ, సోయం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు ఆదేశాలపై ఉద్యోగుల్లో హర్షం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : ప్రతి నెలా ఇచ్చే సాధారణ పింఛన్ల విషయంలో ఉద్యోగులను ఇబ్బంది పెట్టవద్దని సీఎం చంద్రబాబు ఆదేశాలివ్వడం పట్ల రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు హర్షం వ్యక్తం చేశారు. పింఛన్ల పంపిణీని ఉదయం ఐదు గంటలకు కాకుండా ఏడు గంటలకు మొదలుపెట్టాలని ఆదేశాలివ్వడం శుభ పరిణామం అన్నారు. ఉద్యోగులంతా ప్రభుత్వ ఆదేశాలు పాటిస్తూ ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

సివిల్ సప్లై బఫర్ గోదామును తనిఖీ చేసిన జేసీ

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నగర సమీపంలోని వంగూరు సివిల్ సప్లై బఫర్ గోదామును ఏలూరు మండల స్థాయి గోదాములను జేసీ పి.ధాత్రిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పేదలకు సంబంధించిన సరుకులను సకాలంలో పంపిణీ చేసేలా చూడాలను ఏమైనా అవకతవకలకు పాల్పడినా సహించేది లేదని అధికారులను హెచ్చరించారు.

పోస్టర్, బ్రోచర్లు ఆవిష్కరించిన ఎమ్మెల్యే సొంగా

కామవరపుకోట, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కామవరపుకోటలోని శ్రీ భద్రకాళీ సహిత వీరభద్రస్వామి ఆలయంలో పాంచాహ్నిక ధ్వజారోహణ కళ్యాణ మహోత్సవాలు జరగనున్నాయి. ఈ నెల 8వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఈ ఉత్సవాల వివరాలు తెలియచేసే వాల్ పోస్టర్స్ బ్రోచర్లను చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో అఖిలగాండ్ల తెలికుల సంక్షేమ సంఘం నాయకులు బొల్లు సత్యనారాయణ, ఊదర ప్రసాద్, మారం సత్యనారాయణ, మారం నాగేశ్వరరావు ఉన్నారు.

వర్గీకరణ జరిగితేనే ఉప కులాలకు న్యాయం

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : మాదిగ ఉప కులాలకు న్యాయం జరగాలంటే ఎస్సీ వర్గీకరణ జరగాలని ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకుడు విస్సంపల్లి సిద్ధూ అన్నారు. ఫిబ్రవరి 7న మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరిగే కార్యక్రమానికి చెందిన ప్రచారపత్రాలను రెడ్డిగణపవరంలో ఆవిష్కరించారు. వర్గీకరణ ద్వారా 59 ఎస్సీ ఉప కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.ఎలీషా, గల్లా రవి, చాపల రాజేంద్రబాబు, జాన్ సుందరం, తదితరులు పాల్గొన్నారు.

భారత చట్టాలపై సర్.సీ.ఆర్.ఆర్‌లో అవగాహన

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : సర్ సి.ఆర్.రెడ్డి అటానమస్ కళాశాలలో భారత దేశంలో చట్టాలపై అవగాహన అనే అంశంపై మంగళవారం అతిథి ఉపన్యాసం నిర్వహించారు. రీసోర్స్ పర్సన్‌గా అడిషనల్ సూపరింటెండెంట్ నక్కా సూర్యచంద్రరావు హాజరై మాట్లాడారు. భారతదేశంలో ఉన్న చట్టాలు ఎలా పనిచేస్తున్నాయో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఎ.రామరాజు మాట్లాడుతూ చట్టాల ఆవశ్యకతను విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.ఎస్.విష్ణుమోహన్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.విశ్వేశ్వరరావు, టి.జి రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన

ఉంగుటూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : ఉద్యాన పంటల యాజమాన్య పద్ధతుల పట్ల తగిన శ్రద్ధ వహించాలని మండల వ్యవసాయాధికారి ఎస్.ఎస్. ప్రవీణ్ కుమార్, ఉద్యానవన అధికారి దేవదానం కోరారు. మంగళవారం మండలంలోని చిన వెల్లమిల్లి, నీలాద్రిపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతు సేవా కేంద్రంలో నిర్వహించారు. ఈ నెల 20వ తేదీ లోపు పంట నమోదు చేయించుకోవడంతో పాటు, ఎన్.పి.ఎస్.ఎస్. యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

మానవత ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

ఉంగుటూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని మానవత రాష్ట్ర అభివృద్ధి కమిటీ చైర్మన్ సాగిరాజు జానకి రామ్ విద్యార్థులకు నిర్దేశం చేశారు. మంగళవారం కాగుపాడు హైస్కూల్లో జరిగిన కెరీర్ గైడెన్స్, స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తాతిన వెంకన్నబాబు, మానవత రీజియన్ చెర్మన్ పుప్పాల గోపి, గుణ్ణం బుల్లబ్బాయి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉంగుటూరు హైస్కూల్లో హెచ్ఎం మీనా కుమారి ఆధ్వర్యంలో ప్రతిభావంతులకు బహుమతులు అందజేశారు.

తండాలలో సమస్యలు పరిష్కరించాలి

చింతలపూడి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : లంబాడీ తండాలలో సమస్యలు పరిష్కరించాలని ఎస్టీ బంజారా సుగాలి లంబాడీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజబాబు నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని రేచర్ల గ్రామంలో తండా నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 15న నిర్వహించే లంబాడీల ఆరాధ్య దైవం సేవాలాల్ జయంతి, సమస్యలపై చర్చించారు. అనంతరం ఎన్నుకున్న సంఘంలో అధ్యక్షులుగా బోడ వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా భూక్యా శ్రీను, జరబల కిచ్చా, ప్రధాన కార్యదర్శిగా ఎల్.బుచ్చిబాబు, కార్యదర్శులుగా డి.సోంబాబు, డి.శివశంకర్, జి.విజయ, గౌరవ అధ్యక్షులుగా భూక్యా రాములు ఉన్నారు.

క్లాప్ డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి : సీఐటీయూ

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తొలగించిన క్లాప్ డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ డ్రైవర్లను విధుల్లోకి తీసుకోని పక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పాలకవర్గం ఇప్పటికైన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమయ్య, నాయకులు పాల్గొన్నారు.

వట్లూరులో ఘనంగా మహాలక్ష్మి హోమం

పెదపాడు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : వట్లూరులోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మహాలక్ష్మి హోమాన్ని మంగళవారం వేదపండితుల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పూలతో విశేషాలంకరణ చేసి అర్చకులు అగ్నిహోత్రం పవన్ కుమార్, వేదాంతం మోహనకృష్ణల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

విజేతలకు బహుమతుల అందజేత

కామవరపుకోట, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) :చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆధ్వర్యంలో కామవరపుకోట మండలంలో సంక్రాంతిని పురస్కరించుకుని గతంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆ పోటీల్లోని విజేతల ఇళ్లకు వెళ్లి మంగళవారం ఆయన సతీమణి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షులు కిలారు సత్యనారాయణతో పాటు ఆయా గ్రామాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

7 నుంచి మన్నా చర్చిలో ప్రార్థన పండుగలు

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ వద్ద ఇండోర్ స్టేడియంలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో ప్రార్థన పండుగలు నిర్వహిస్తున్నట్టు మన్నా చర్చ్ పాస్టర్ ఎం.జ్యోతిరాజు తెలిపారు. మన్నాచర్చ్‌లో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరాజు మాట్లాడుతూ చెన్నై నుంచి అంతర్జాతీయ సువార్తికులు పాల్ దినకరన్, సిస్టర్ యువాంజలిన్ దినకరన్, బ్రదర్ శామ్యూల్, సిస్టర్ స్టెల్లా, బ్రదర్ డానియేలు, ఈ పండుగల్లో వాక్యోపదేశం చేస్తారని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 6గంటలకు ప్రార్థన పండుగలు ప్రారంభమవుతాయన్నారు.

ఎన్నికల కోడ్ సందర్భంగా ఫ్లెక్సీల తొలగింపు

లింగపాలెం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సందర్భంగా లింగపాలెం మండలంలో ఫ్లెక్సీలు తొలగించారు. మండలంలో ఉన్న వివిధ రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగారు. కోడ్ ముగిసే వరకు మండలంలో ఎక్కడా రాజకీయాలకు సంబంధించిన ఫ్లెక్సీలను పెట్టకూడదని తెలిపారు. ఫ్లెక్సీల తొలగింపులో పంచాయతీ కార్యదర్శి సిబ్బంది పాల్గొన్నారు.




ఏలూరులో రథ సప్తమి పూజలు, సూర్య భగవానుడిని పూజిస్తున్న భక్తులు



పోలవరంలో పాండురంగడు



జంగారెడ్డిగూడెంలో గోకుల పారిజాతగిరి శ్రీనివాసుడు

భక్తి శ్రద్ధలతో రథ సప్తమి

ఏలూరు కార్పొరేషన్/రూరల్/ ఉంగుటూరు/ బుట్టాయగూడెం/జంగారెడ్డిగూడెం/పోలవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : రథ సప్తమి పర్వదినం సందర్భంగా మంగళవారం ఏలూరు పాతబస్టాండ్ సెంటర్‌లోని పాండురంగస్వామి ఆలయ ప్రాంగణంలో అర్చకులు దండిబొట్ల కనకసుందర శర్మ, వేద పండితులు సంయుక్తంగా భక్తులతో సామూహిక పూజలు జరిపించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్. చిననాగేశ్వరరావు, సిబ్బంది భక్తులతో పూజలు చేయించారు. రథ సప్తమి వేడుకల్లో భాగంగా మంగళవారం ఉంగుటూరు మండలంలోని కైకరం - అక్కుపల్లి గోకవరం గ్రామాల మధ్య ఉన్న శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయం వద్ద రుత్విక్కులు యాజ్ఞవల్క్య లక్ష్మీకాంతారావు అర్చకత్వంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గీతామృత వాహిని సత్సంగ్ భజన మండలి ఆధ్వర్యంలో లలితా పారాయణాన్ని ఆలపించారు. కైకరం సుబ్రహ్మణ్య స్వామి, సూర్య నారాయణ స్వామి ఆలయాల్లో అన్న సమారాధనలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి భ్రమరాంబ సహిత మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథసప్తమి సందర్భంగా ప్రముఖ ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. భక్తులు తెల్లవారు జామునే ఆలయాలకు తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు కృష్ణచైతన్య శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు సూర్యభగవానుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో రథసప్తమి సందర్భంగా సూర్యప్రభ సేవ,శ్రీ చక్రస్నాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి నిత్య ఆరాధన అనంతరం సూర్యప్రభ వాహనంపై శ్రీనివాసుని అలంకరించి భక్తుల గోవిందనామ స్మరణతో మంగళవాయిద్యాలతో ఆలయం చుట్టూ తిరువీధి ఉత్సవం నిర్వహించారు.ఆలయ ప్రాంగణంలో ఉన్న పుష్కరిణి ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు చక్రస్నాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని ఈఓ మానికల రాంబాబు తెలిపారు. బుట్టాయగూడెం విద్యా రిహిణి పబ్లిక్ స్కూల్లో రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థుల చేత సూర్య నమస్కారాలు చేయించారు. రథసప్తమి సందర్భంగా మంగళవారం ఏలూరు ఇండోర్ స్టేడియంలో పతాంజలి యోగా ఆధ్వర్యంలో సూర్యభగవానుడికి పూజలు నిర్వహించి, యోగా గురువు డి.గోపాలకృష్ణ, రిటైర్డ్ ఏఎస్పీ విజయరామారావు ఆధ్వర్యంలో 108సార్లు సూర్యనమస్కారాలు నిర్వహించారు. పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద మూడు రోజుల పాటు జరగనున్న రథ సప్తమి ఉత్సవాలను మంగళవారం ఏపీఎస్ఆర్‌టిసి విజయవాడ జోన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు

పోలవరం మండలంలో రథ సప్తమి సందర్భంగా సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు, పాండురంగడి గ్రామ ఊరేగింపు కార్యక్రమాలు నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పోలవరం గ్రామ శివారున గరుడాద్రి పర్వతంపై ఉన్న పాండురంగడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గూటాల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సూర్యభగవానునికి పూజలు నిర్వహించి లక్ష్మీ నరసింహ స్వామిని ఊరేగింపు చేశారు. పోలవరం ఆంజనేయస్వామి ఆలయంలో, పాత పోలవరం వెంకటేశ్వరస్వామి ఆలయం, పట్టిసీమ శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో వెంకటేశ్వరస్వామికి సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కల్లుగీత మద్యం లైసెన్సులకు 12 దరఖాస్తుల స్వీకరణ

ఏలూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో కల్లుగీత కార్మికుల ఉపకులాలకు రిజర్వ్ చేసిన 14 మద్యం దుకాణాల లైసెన్సులకు మంగళవారం 12 దరఖాస్తులు అందాయి. రాత్రి 8 గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ఈ దరఖాస్తులు అందినట్లు ఏలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య తెలిపారు. కైకలూరు నుంచి 4,నూజివీడు నుంచి 4, పోలవరం నుంచి 2, భీమడోలు, చింతలపూడి నుంచి ఒక్కో దరఖాస్తులను ఆయా వర్గాల వారు సమర్పించారన్నారు. లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి బుధవారం సాయంత్రం వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి, 7న ఉదయం 10 గంటలకు ఏలూరు సురేష్ బహుగుణ పోలీస్ స్కూల్లో లైసెన్సులకు లాటరీ తీసి దుకాణాలు కేటాయిస్తామన్నారు.

ఉద్యోగులు హెల్మెట్ ధరించకుంటే లీవ్ కట్ : ఆర్డీవో

ఏలూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులు ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ ధరించకుండా కార్యాలయానికి వస్తే కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ రోజు లీవ్ కట్ చేస్తామని జంగారెడ్డి గూడెం ఆర్డీఓ ఎం.వి. రమణ తెలిపారు. మంగళవారం రవాణా శాఖ ఆధ్వర్యంలో భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ర్యాలీని ఆర్డీవో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఎం.వి.రమణ మాట్లాడుతూ హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనం నడిపడం ప్రభుత్వ ఉద్యోగులు నేర్చుకోవాలని అన్నారు. ప్రాంతీయ రవాణా అధికారి ఎం.డి.మదాని మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ప్రజలంతా సహకరించాలని అన్నారు.హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే అపరాధరుసుం విధిస్తామన్నారు. ఈర్యాలీ జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం నుంచి బస్టాండు వరకు కొనసాగింది.ఈ కార్యక్రమంలో ఎంవీఐ ఎస్. రంగనాయకులు, ఏఎంవీఐ వై.సురేష్‌బాబు, ఏవో చంద్రశేఖర్, నాగేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థి గెలుపునకు కృషి చేయండి : ఎమ్మెల్యే బడేటి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు సమష్టి కృషితో పని చేయాలని టీడీపీ పరిశీలకురాలు ఏ.సునీత, ఎమ్మెల్యే బడేటి చంటి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ డివిజన్ ఇన్‌చార్జ్‌లు బూత్‌స్థాయి నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన పరిశీలకురాలు సునీత మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించడానికి పట్టభద్రులైన ఓటర్లను కలిసి అభ్యర్థించాలన్నారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ బూత్‌స్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు ఓటర్లందర్నీ కలిసి కూటమి అభ్యర్థిని గెలిపించాలని కోరాలని తెలిపారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ కూటమి పాలనకు ఎమ్మెల్సీ ఎన్నికలు రిఫరెండంగా పార్టీల అధినేతలు భావిస్తున్నందున ప్రతీ ఒక్కరు కష్టపడి పని చేయాలన్నారు.

ఐటీడీఏ పీవో సభలో గందరగోళం

వేలేరుపాడు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పోలవరం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పంపిణీ చివరి అంకానికి చేరుకుంది. ఈ నేపథ్యంలో మంగళవారం వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఆర్అండ్ఆర్ గ్రామ సభ దాదాపు రెండు గంటల పాటు గందరగోళం మధ్య కొనసాగింది. ఈ గ్రామ సభకు విచ్చేసిన కేఆర్.పురం ఐటీడీఏ పీఓ ఆర్అండ్ఆర్ ప్రత్యేకాధికారి కే.రాములు నాయక్ ముందుగా నిర్వాసితులనుద్దేశించి మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన వారు జాబితాలో లేకపోయిన నాన్ లోకల్‌గా పరిగణించి వారు అన్ని ఆధారాలు సమర్పించి తమకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో 45.72 కాంటూరు పరిధిలోని 9 గ్రామాల ప్రజలు అలాగే 41.35 కాంటూరు పరిధిలో నమోదు కాని గ్రామాల ప్రజలు ఈ ప్రకటనపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ధర్నాకు దిగారు. దీంతో ఐటీడీఏ పీవో గందరగోళం మధ్య సభా ప్రాంగణాన్ని విడిచి పెట్టి తహసీల్దార్ కార్యాలయంలోకి వెళ్ళిపోయారు. దీంతో రెండు గంటల పాటు సభ జరగకుండా అడ్డుకున్నారు. పీఓ రాములు నాయక్ వచ్చి నిర్వాసితుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇవ్వడంతో అంతా శాంతించారు.

జనసేన పార్టీలోకి భారీగా చేరికలు

ఉంగుటూరు/నిడమర్రు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : జనసేనాని ఆశయాల పట్ల అంకిత భావంతో పని చేయాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మంగళవారం రాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శుల సమక్షంలో వైసీపీ శ్రేణులు జనసేనలో చేశారు. పెద్ద ఎత్తున ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, గణపవరం మండలాల ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు ముఖ్య నేతలు హాజరై మండలాల వారీగా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులతో పాటు జనసేన సమన్వయకర్త వట్టి పవన్ కుమార్, పత్తి మధన్, తోట శ్రీను తదితరులు పాల్గొని వారిని పార్టీలోకి ఆహ్వానించారు.



జనసేన పార్టీలో చేరుతున్న నాయకులు



కోలాటం నిర్వహిస్తున్న మహిళలు

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయ ప్రధాన రాజగోపురం ముందు మహిళలు మంగళవారం నిర్వహించిన కోలాట ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. కాకినాడకు చెందిన జయశ్రీ కోలాటసమాజ బృందం ముందుగా సంప్రదాయ దుస్తులతో క్షేత్రానికి వచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

వైభవంగా అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలు

దెందులూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : చల్లని తల్లిగా కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరు పొందిన అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి తన నియోజకవర్గంలో ఉండటం తన అదృష్టంగా భావిస్తున్నానని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మంగళవారం దెందులూరు మండలం గాలాయగూడెం గ్రామ దేవత అచ్చమ్మ పేరాంటలమ్మతల్లి 68వ వార్షికోత్స ఉత్సవాలను మండల అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్‌తో కలిసి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం అచ్చమ్మ పేరాంటలమ్మ తల్లిని శాసన సభ్యులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత శాసన సభ్యులను ఆలయ కమిటీ సభ్యులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం జరిగిని ఉత్సవ సమావేశంలో చింతమనేని మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాల నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేశారని, పోలీసులు మరింత జాగ్రత్తగా ఉండాలని చింతమనేని ఆదేశించారు.



ఉత్సవాలు ప్రారంభిస్తున్న చింతమనేని

వరల్డ్ క్యాన్సర్‌డేపై అవగాహన

పెదపాడు/కామవరపుకోట, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వ మెడి కల్ కళాశాలకు చెందిన కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వ ర్యంలో వరల్డ్ క్యాన్సర్ డేను పురస్కరించుకుని ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వచ్చిన వారికి అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, వ్యాధి లక్షణాలను మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టరు పి.సావిత్రి తెలియజేశారు. కామవరపుకోట మండలం రావికంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా శిక్షణా అధికారి బిరుదుగడ్డ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

6న పట్టిసీమ ఉత్సవాలపై రెండవ సమీక్ష

ఏలూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పోలవరం మండలం పట్టిసీమలో కొలువైన భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి శివక్షేత్రంలో నిర్వహించే మహా శివరాత్రి ఉత్సవాలపై రెండవ సమీక్షను ఈ నెల 6న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.వి. రమణ మంగళవారం మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహించే ఈ ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించనున్నట్టు తెలిపారు.

శ్రీవారి సన్నిధిలో వాహన సేవలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : రథ సప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక రామచంద్రరావు పేటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పలు వాహన సేవలను ఆలయ ప్రధాన అర్చకులు కిళాంబి మారుతి శ్రీనివాస రామానుజాచార్యులు నిర్వహించారు. సూర్యప్రభ వాహన సేవ, సింహవాహన సేవ, గరుడ వాహనసేవ, హనుమంత వాహన సేవ, కల్పవృక్ష వాహనసేవ, గజవాహన వాహనసేన, చంద్రప్రభ వాహనసేవ కార్యక్రమాలు నిర్వహించారు.

ఆశ్రంలో ఉచిత వైద్య శిబిరాలు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ జబ్బుకు చికిత్స కన్నా నివారణే మేలని ఆశ్రం అంకాలజీ వైద్యులు డాక్టర్ శైలజ, డాక్టర్ సింధూ, డాక్టర్ కల్యాణి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుని 4న ఆశ్రం ఆసుపత్రిలో ఉచిత అవగాహన శిబిరం నిర్వహించారు. ఆశ్రం ఆసుపత్రి వైద్యులు, క్యాన్సర్ నిపుణులు పాల్గొని రోగులకు వైద్యసలహాలు అందించారు.

వాహనాల తనిఖీల్లో కేసులు నమోదు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : హెల్మెట్ ధరించకపోయినా, వాహనాలకు సరైన పత్రాలు లేకపోయినా కేసులు నమోదు చేస్తామని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర హెచ్చరించారు. సి.ఆర్.ఆర్. కళాశాల వద్ద మంగళవారం మోటారు వాహనాలను తనిఖీ చేశారు. ప్రమాద సమయంలో హెల్మెట్, సీటుబెల్టు, ప్రాముఖ్యతను వాహనదారులకు తెలియజేశారు.

శాంతితోనే నవసమాజ నిర్మాణం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ శాంతి ప్రచారంలో భాగంగా కమ్యూనిటీ నూరుల్ ఇస్లామ్ శాఖ ప్రజా సంబంధాల అధికారి మహ్మద్ జావిద్, అహ్మద్ బాషా మంగళవారం ఏలూరులో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతితోనే నవ సమాజం నిర్మితమవుతుందని అన్నారు.

బాధిత చిన్నారులకు 20వేల ఆర్థిక సాయం

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాహుల్, రేణుకల భవిష్యత్ కోసం నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి రూ.20 వేలు అందజేసినట్టు నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీ పిఆర్‌ఓ ఎ.వి. రాఘవరావు తెలిపారు. ఈ మొత్తాన్ని ఆర్డీఓ, రాహుల్, రేణుకల పేరుతో ఉన్న అకౌంట్‌లో జమ చేసినట్లు తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందికి భద్రతకు అవగాహన కల్పించారు. హెల్మెట్, సీటుబెల్టు ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. అతివేగం ప్రమాదకరమని, మద్యం మత్తులో వాహనాలను నడపరాదని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు, రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సాగులో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలి

లింగపాలెం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలని పట్టు పరిశ్రమల శాఖ, సెరీకల్చర్ డీడీ వాణి అన్నారు. మండలంలోని మఠం గూడెం, సింగగూడెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామాల్లో మొక్కజొన్న తోటలను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు మొక్క జొన్న పంటలో తెగుళ్ల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

అధికారులను సమన్వయపర్చడానికి సమీక్షలు నిర్వహిస్తున్నాం



రాజ్ మనోజ్, ఎంపీడీవో, ఉంగుటూరు

● మండలంలో సచివాలయ సిబ్బంది పనితీరు ఎలా ఉంది.

జవాబు : మండలంలోని సచివాలయ సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. హాజరు విషయంలో తగిన సూచనలిస్తున్నాం.

● ఉపాధి హామీ కూలీలకు మీ సూచనలు ఏమిటి?

జవాబు : ఉపాధి హామీ కూలీలు పనులలోకి వచ్చేటప్పుడు పలుగు, పార, గిన్నెలు తెచ్చుకోవడం లేదు. వారంతా ఏక కాలంలో పనిలోకి రావడం ద్వారా నిర్ణీతంగా కనీసం నాలుగు గంటలు పనిచేయాలి. అందరూ సమానంగా పనిచేయడం ద్వారా కనీస వేతనం రూ.300లు పొందవచ్చు.

● మస్తర్ల గోల్‌మాల్‌పై ఆరోపణలను ఎలా పరిష్కరిస్తారు.

జవాబు : మస్తర్ల గోల్‌మాల్ జరగడం వల్ల బినామీలకు లాభం చేకూరుతోంది. దీని వల్ల మేట్‌లు ఎప్పటికప్పుడు సమీక్ష జరిపి సమాన పనికి సమాన వేతనం వచ్చేలా చూడాలి..

● సగటున వారానికి ఎంత వేతనం పొందవచ్చు?

జవాబు : సగటున వారానికి రూ.2,100లను పొందే అవకాశం ఉంది. పనిని అందరూ సక్రమంగా నిర్వహిస్తే సాధ్యమవుతుంది.

● మండల పరిషత్తు పరిధిలో అన్ని శాఖల అధికారులు సమన్వయం జరుగుతుందా?

జవాబు : మండలంలో అన్ని శాఖల మధ్య సమన్వయానికి ప్రతి పదిహేను రోజులకు ఒకసారి సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాం.

- ఉంగుటూరు

ఆరు శాశ్వత పోస్టులు

చింతలపూడి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నగర పంచాయతీల్లో పోస్టుల భర్తీలో భాగంగా ఇచ్చిన ఉత్తర్వుల్లో భాగంగా చింతలపూడి నగర పంచాయతీకి పర్మినెంట్ పోస్టులు ఆరు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు నగర పంచాయతీలో మునిసిపల్ కమిషనర్ సైతం డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. తాజా జీవో వల్ల నగర పంచాయతీలో ఆరు పర్మినెంట్ పోస్టులు మంజూరయ్యాయని కమిషనర్ పావని తెలిపారు. ఇందులో మునిసిపల్ కమిషనర్, మేనేజర్, రెండు ఏఈ పోస్టులు, ఒక అటెండర్, మరో శానిటరీ మేస్త్రి ఉన్నట్టు తెలిపారు.

మధ్యాహ్న భోజనం ప్రారంభం

జీలుగుమిల్లి, జనవరి 4 : (ఆంధ్రజ్యోతి) : 6 నెలల్లో అనేక సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వం అమలు చేసినట్లు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు.ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం శనివారం ప్రారంభించారు. డొక్కా సీతమ్మ ప్రతిభను గుర్తించి ఆమె పేరున పథకాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రారంభించినట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు.

అరసవల్లి క్షేత్రంలో చిన వెంకన్న ఆలయ ఇన్‌చార్జి ఈవో

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా అరసవల్లి క్షేత్రంలో కొలువైన సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని చిన వెంకన్న దేవస్థానం ఇంచార్జ్ ఈవో వేండ్ర త్రినాథరావు దంపతులు దర్శించారు. ఆలయానికి వెళ్లిన ఆయన స్వామివారి మూల విరాట్‌ను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం అక్కడి అర్చకుల నుంచి స్వామి వారి చిత్రపటాన్ని అందుకున్నారు.

చేబ్రోలులో పిచ్చి, క్యాన్సర్ వ్యాధులపై అవగాహన

ఉంగుటూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ స్కిజో ఫ్రేనియా(పిచ్చి) దినోత్సవం సందర్భంగా చేబ్రోలు పి.హెచ్.సి.లో వ్యాధిపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కె.ఎస్.వర్మ, శ్రావణ్ రెడ్డి, హెల్త్ విజిటర్ నాగలక్ష్మి, సైకాలజిస్టు కె.శ్రీనివాసరావు, సోషల్ వర్కర్ తిరుపతి స్వామి, స్వర్ణ కుమారి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

అప్పనవీడులో అన్నదానం

పెదపాడు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం అప్పనవీడులోని అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద దాత మాకిన సీతారామపాత్రుడు సహకారంతో 200 మంది భక్తులకు అన్నదానం నిర్వహించినట్లుగా ఆలయ ఈవో తారకేశ్వరరావు తెలిపారు. మంగళవారం కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించగా, అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. దేవాలయం వద్ద హనమాన్ భజన మండలి సభ్యులచే హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. దేవాలయం సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ నిర్ణయంపై హర్షం

ఏలూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలియజేయడాన్ని జంగారెడ్డిగూడెం ఎంఆర్పీఎస్ నాయకులు, పలు పార్టీల నాయకులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏలూరు రోడ్డులోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ ముప్పిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా మాదిగలు, మాదిగ ఉప కులాలు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమ ఉద్దేశం నేడు నెరవేరిందని అన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి మాదిగలంతా కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్లు తెలిపారు.

బస్ స్టేషన్ భవనంపై మొక్కల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ముదినేపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి ఆర్టీసీ బస్ స్టేషన్ భవనంపై పెరుగుతున్న మొక్కలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు బస్ స్టేషన్ భవనం బీటలు వారుతున్న విషయంపై 'నిర్లక్ష్యానికి నిదర్శనం' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. అధికారుల ఆదేశాలతో కంట్రోలర్ మద్దా కోటేశ్వరరావు బస్ స్టేషన్ భవనంపై పెరిగిన మొక్కలను తొలగించారు.

పాలన ఎలా ఉంది?

» టీడీపీ ఇన్‌చార్జిల తీరుపై ఐవీఆర్‌లో అధిష్ఠానం ఆరా

» తెలుగుదేశం శ్రేణుల ఆసక్తి



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జిల పనితీరు, పాలనపై అధిష్ఠానం ఆరా తీస్తోంది. కూటమి భాగస్వామ్య పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నచోట టీడీపీ ఇన్‌చార్జిలు ఉన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 15 నియోజకవర్గాలను గడచిన ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి కైవసం చేసుకుంది. భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, ఉంగుటూరు, పోలవరం, నిడదవోలు నియోజకవర్గాల్లో కూటమి తరఫున జనసేన ఎమ్మెల్యేలు ఉన్నారు. ఆరు చోట్ల తెలుగుదేశం పార్టీకి ఇన్‌చార్జ్‌లు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పార్టీ కేడర్‌ను కాపాడుకోవాలంటూ ఎప్పటికప్పుడు అధిష్ఠానం దిశానిర్దేశం చేస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావడంతో పాలన, ఇన్‌చార్జిల పనితీరుపై అధిష్ఠానం దృష్టి పెట్టింది. ఐవీఆర్ కాల్స్ ద్వారా ప్రజల స్పందన తెలుసుకుంటోంది. తెలుగుదేశం కేడర్‌తోపాటు అన్ని వర్గాల ప్రజలకు ఐవీఆర్ కాల్స్ వచ్చాయి. ఇన్‌చార్జ్‌ల పాలన ఎల ఉందని ప్రశ్నించి బాగాలేదు, ఫరవాలేదు, బాగుంది అంటూ 3 ఆప్షన్‌లు ఇచ్చారు. ఒక ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలని సూచించారు, ఇటీవల ఎమ్మెల్యేల పనితీరుపైనా కూటమి ప్రభుత్వం ఆరా తీసింది. తాజాగా ఇన్‌చార్జ్‌ల పనితీరుపై దృష్టి పెట్టింది.

ఇంటెలిజెన్స్ నివేదికలు

ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల పనితీరుపై ఎప్పటికప్పుడు ఇంటెలిజెన్స్ విభాగం వివరాలు చేరవేస్తోంది. తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం కూడా నియోజకవర్గాల్లో పరిస్థితులపై దృష్టి పెట్టింది. ఇటీవల జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో సెటిలెమెంట్‌లు అధికంగా ఉంటున్నాయి. వాటిలో ముఖ్యపాత్ర పోషిస్తున్న వారిపై అధిష్ఠానం వద్ద నివేదికలున్నాయి. నియోజకవర్గాల్లోనూ ఈ దందాపై చర్చ సాగుతోంది. వారి ప్రభావం ఎమ్మెల్యేల పనితీరుపైనా ప్రభావం చూపుతోంది. అధిష్ఠానం వద్ద నెగటివ్ మార్కులు పడుతున్నాయని నియోజకవర్గ కేడర్‌లో చర్చ జరుగుతోంది. ఐవీఆర్ కాల్స్ ద్వారా ప్రజల నుంచి కూడా అదే రకమైన స్పందన వస్తోందని పార్టీ కార్యాలయాల నుంచి సంకేతాలు వస్తున్నాయి. మొత్తంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేల పనితీరును అధిష్ఠానం నిశితంగా గమనిస్తోంది.

పౌల్ట్రీ కోడిపై వైరస్ దాడి

» అంతుచిక్కని వైరస్ » లక్షల్లో కోళ్లు మృతి

» గుడ్ల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం » సంక్షోభంలో పౌల్ట్రీ పరిశ్రమ



తణుకు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ పరిశ్రమపై వైరస్ దాడి చేసింది. గత డిసెంబరులో వైరస్ వ్యాప్తితో కోళ్లు చనిపోతునే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 30 లక్షల నుంచి 40 లక్షల కోళ్లు మృత్యువాత పడినట్లు అంచనా. గుడ్ల ఉత్పత్తి కూడా తగ్గి పౌల్ట్రీ పరిశ్రమ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది. పౌల్ట్రీ పరిశ్రమపై చలికాలంలో వైరస్ ప్రభావం ఎక్కువ. ప్రస్తుతం ఆర్‌డి వైరస్ కొత్త వేరియంట్‌తో అధిక సంఖ్యలో కోళ్లు చనిపోతున్నాయని భావిస్తున్నారు. ఈనెలాఖరు వరకు వైరస్ ప్రభా వం ఉంటుందని, వేసవి రాకతోనే వైరస్ తగ్గుముఖం పడుతుందని రైతులు చెబుతున్నారు. ఏటా క్రమం తప్పకుండా పౌల్ట్రీ కోళ్లకు వాక్సిన్ వేయిస్తే వైరస్ ప్రభావం తక్కువగా ఉంటుందని సమాచారం. పౌల్ట్రీ పరిశ్రమపై వైరస్ దాడితో లక్షలో కోళ్లు మృత్యువాత పడడంతో అదే స్థాయిలో గుడ్ల ఉత్పత్తి పడిపోయింది. ఉమ్మడి జిల్లాలోని పౌల్ట్రీ ల్లో 1.7 కోట్ల కోళ్లు ఉంటే రోజుకు 1.1 కోట్ల గుడ్లు ఉత్పత్తి అయిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం రోజుకు 80 లక్షల నుంచి 90 లక్షల గుడ్లు వస్తున్నాయి. ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు తగ్గిపోయాయి. గతంలో బీహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాలకు 30 లారీల గుడ్లు ఎగుమతి అయ్యేవి. ప్రస్తుతం 12 నుంచి 15 లారీలు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. వైరస్ వ్యాప్తితో పౌల్ట్రీ పరిశ్రమకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతుంది. 2006లో బర్డ్‌ఫ్లూ వైరస్ ప్రభావంతో రైతులు నష్టపోయారు. అప్పటి నష్టాలతో చాలా మంది పరిశ్రమ నుంచి ఇతర రంగాల వైపు వెళ్లిపోయారు. ప్రస్తుత వైరస్ తాకిడికి తిరిగి అదే పరిస్థితి తలెత్తింది.

సంరక్షణ ఇలా..

- వైరస్ దాడితో మృత్యువాత పడిన కోళ్లను బహిరంగ ప్రాంతాల్లో వదిలేస్తే వైరస్ మరింత ఉధృతమయ్యే అవకాశాలున్నాయి.
- అధిక సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడితే గొయ్యి తీసి పాతిపెట్టాలి.
- ఫారమ్ కోళ్లకు వైరస్ నిరోధ వాక్సిన్ వేస్తుంటారు. నాటుకోళ్లకు వాక్సిన్ వేస్తే వైరస్ వ్యాప్తి తగ్గుతుంది.
- పౌల్ట్రీలకు మెస్ ఫినిషింగ్ ఉంటే వైరస్ వ్యాప్తి తక్కువగా ఉంటుంది.
- జీవ సంరక్షణ విధానాలతో ఫారమ్‌లకు మేలు జరిగే అవకాశాలు ఉంటాయి.
- బలవర్ధక ఆహారం అందించే ఫారమ్‌లో వైరస్ ఉధృతి తక్కువ.

వైరస్ నిర్ధారణకు నమూనాల సేకరణ

పశుసంవర్ధక శాఖ జేడీ మురళీకృష్ణ

వైరస్ దాడితో మృత్యువాత పడిన నమూనాలు సేకరించి విజయవాడ ల్యాబ్ పంపించినట్లు పశుసంవర్ధక శాఖ జేడీ మురళీకృష్ణ తెలిపారు. తణుకులోని నెక్ కార్యాలయం వద్ద మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోళ్ల ఫారలలో జీవ సంరక్షణ చర్యల ద్వారా వ్యాధులను అదుపు చేయవచ్చన్నారు. 15 రోజుల నుంచి దేశవాళీ కోళ్లు, పౌల్ట్రీ కోళ్లలో అసహజ మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. కోళ్లలో వ్యాధి నిరోధక శక్తి క్షీణించడంతో మిక్స్‌డ్ వైరస్ వ్యాధులు వ్యాపిస్తున్నాయని వివరించారు. అధిక సంఖ్యలో మృత్యువాత పడడంపై కారణాలు పరీక్షల తర్వాత తెలుస్తాయన్నారు.

రైతులు వ్యాధి నివారణకు బయో సెక్యూరిటీ విధానాలు పాటించాలన్నారు. చనిపోయిన కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో గొయ్యి తీసి పూడ్చాలన్నారు. వైరస్ మనుషులకు సోకే అవకాశం లేదన్నారు. గుడ్లు, మాంసం విని యోగించవచ్చన్నారు. జేడీతో పాటు డిప్యూటీ డైరెక్టర్లు ఎల్‌కే.సుధాకర్, వాకాణి ప్రసాద్, ఏడీలు అత్తిలి నరసింహారావు, శంకర్, పౌల్ట్రీ అసోషియేషన్ ప్రతినిధులు కొమాట్లపల్లి వెంకట సుబ్బారావు, గుడిశి గంగాధరరావు, మోహన్ పాల్గొన్నారు.

పౌల్ట్రీ రైతుల సమస్యలు పరిష్కరించండి : సీఎంకు వినతి



ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇస్తున్న పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు సుబ్బారావు, తదితరులు

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ రైతుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లినట్లు పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, కాల్దరి గ్రామానికి చెందిన కోమట్లపల్లి వెంకట సుబ్బారావు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబును మంగళవారం విజయవాడలో సమస్యలను వివరించారు. సంక్షోభంలో ఉన్న పౌల్ట్రీ పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరినట్టు చెప్పారు. జొన్న దిగుమతి సుంకం తగ్గించాలని, బ్యాంకు రుణాలపై వడ్డీ రాయితీ ఇవ్వాలని కోరామన్నారు. సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని సుబ్బారావు చెప్పారు. టి.కుటుంబరావు, పడాల సుబ్బారెడ్డి, గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం, జి.గంగాధరరావు, పౌల్ట్రీ యజమానులు ఉన్నారు.

పెద్దింటమ్మ జాతరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు : ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అచ్యుత్ అంబరీష్

కైకలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కొల్లేటి కోట పెద్దింటి అమ్మవారి జాతరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ అన్నారు. ఉత్సవాల ఏర్పాట్లపై తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. పారిశుధ్యం, పార్కింగ్, ట్రాఫిక్, తాగునీరు, ఆర్టీసీ బస్సు సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించాలన్నారు. కొల్లేటికోట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అమ్మవారి కల్యాణోత్సవం, తెప్పోత్సవానికి పెద్దఎత్తున భక్తులు తరలివస్తారని, తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయం చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటుచేయాలని, ఆలయానికి 500మీటర్ల లోపు మద్యం విక్రయాలు లేకుండా చూడాలన్నారు. పైడిచింతపాడు మీదుగా కొల్లేటి కోటకు వచ్చే రహదారి నాలుగు కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. ఆలపాడు వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులకు రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పార్కింగ్ ఫీజులు, ప్రభుత్వ నిబంధనల మేరకే ఉండాలని, అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పెద్దింటిమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాట్లను ఆర్డీవో పరిశీలించారు. దేవదాయ ధర్మదాయ శాఖ జిల్లా అధికారి సీహెచ్ రంగారావు, తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, ఎంపీడీవో ఆర్.ఫణీంద్ర, సీఐ వి.రవికుమార్, ఈవో కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

24 నుంచి భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

కలిదిండి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పురస్కరించుకుని 24 నుంచి పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు జరగనున్నాయి. అధికారులంతా సమన్వయంతో పని చేయాలని ఆలయ ఈవో శేఖర్ అన్నారు. ఆలయం వద్ద వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 24 నుంచి 28 వరకు కల్యాణోత్సవాలు జరుగుతాయి. 26న శివరాత్రి మహోత్సవానికి వేలాది మంది భక్తులు తరలివస్తారని, అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. తహసీల్దార్ రామకృష్ణ, సీఐ రవికుమార్, ఎస్ఐ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కృష్ణారావు, పంచాయతీ రాజ్ ఏఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సురేఖ

క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే నివారణ సులభం

కైకలూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కేన్సర్ వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే నివారించవచ్చని కామినేని హాస్పిటల్ వైద్యురాలు సురేఖ అన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా వికాస తరంగణి ఆధ్వర్యంలో వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ సురేఖ మాట్లాడుతూ ఆహార అలవాట్లలో మార్పులు, అనేక రకాల ఔషధాల వినియోగంతో చాలా మంది కేన్సర్ బారిన పడుతున్నారన్నారు. ప్రిన్సిపాల్ వై.శ్రీలత, వికాస తరంగణి అధ్యక్షురాలు సీహెచ్ హేమలత, ఉమెన్ ఎన్‌ఫోర్‌మెంట్‌సెల్ కన్వీనర్ వై.జ్ఞానప్రసూనాంబ, జువాలజీ అధ్యాపకురాలు వి.సంధ్య పాల్గొన్నారు.



చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న డీసీ చైర్మన్ వాసురాజు

పంట కాల్వల్లో చెత్త తొలగింపు

కైకలూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పంట కాల్వల్లో చెత్తా చెదారం వేయకుండా ప్రజలు సహకరించాలని డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు అన్నారు. గోనెపాడు నుంచి పల్లెవాడ వరకు పంట కాలువల్లో చెత్త తొలగింపు పనులు మంగళవారం నిర్వహించారు. అనంతరం పల్లెవాడ పంచాయతీ మంచినీటి చెరువుకు సర్పంచ్ దుట్టా మణితో కలిసి మంచినీటిని నింపుతున్న పనులను పరిశీలించారు.

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

నియోజకవర్గ పరిశీలకుడు మెంటే

ముదినేపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని నియోజకవర్గ పరిశీలకుడు మెంటే పార్థసారథి కోరారు. బొమ్మినంపాడు, సింగరాయపాలెం, శ్రీహరిపురం గ్రామాల్లో రాజేంద్రప్రసాద్ తరఫున మంగళవారం సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఇతర నాయకులతో కలసి ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలసి ఓట్లను అభ్యర్థించారు. బొంగు రవికుమార్, యర్రా రాంబాబు, బొమ్మినంపాడు సర్పంచ్ దారం సుధ, కేసం ప్రసాద్, బూరుబోయిన బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



శ్రీహరిపురంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పార్థసారథి, కన్వీనర్ నరసింహారావు

రావిచర్లలో రైతులకు పొలం పిలుస్తోంది

నూజివీడు టౌన్ ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్నలో ఎండుతెగులు నివారణకు ట్రైకోడెర్మావిరిడి రైతులకు అందుబాటులో ఉంచినట్లు నూజివీడు మండల వ్యవసాయశాఖ అధికారిణి ఏ.చాముండేశ్వరి తెలిపారు. మంగళవారం నూజివీడు మండలం కొత్తరావిచర్ల, పాత రావిచర్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రావిచర్ల సర్పంచ్, మాజీ ఏఎంసీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు హాజరయ్యారు. వ్యవసాయశాఖ అధికారిణి మాట్లాడుతూ పురుగుల నివా రణకు వేప సంబంధ పదార్థాలను పిచికారీ చేయాలన్నారు. లీటరు నీటికి మూడు మిల్లీలీటర్ల వేపనూనె ఉపయోగించుకోవాలన్నారు. ఉద్యానశాఖ అధికారిణి ఆర్.హేమ మాట్లాడుతూ మామిడితోటల్లో కలుపులేకుండా చూసుకోవాలన్నారు. తామరపురుగుల నివారణకు స్పైనోసాడ్ లేదా థయో మిదాక్సమ్ 0.5 గ్రాములు లేదా ఫిప్రోనిల్ గోల్డ్ పిచికారీ చేయాలన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల్లో క్రమశిక్షణ, మంచి అలవాట్లతో పాటు నైతిక విలువలు పెంపొందించి బావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని సమగ్రశిక్ష ఏలూరు అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.పంకజ్‌కుమార్ సూచించారు. మండలంలోని తోటపల్లిలో గల హీల్ పారడైజ్ ఆవరణలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అకాడమిక్ మానిటరింగ్ అధికారి రెడ్డి రామారావు, రీసోర్సు పర్సన్స్ పి.వెంకటరమణ, శ్రీరామ్, హరికృష్ణ పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ కోతలపై రైతుల ఆందోళన

ముసునూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యుత్ కోతలపై బసవరపుపాడు సబ్ స్టేషన్ వద్ద రైతులు మంగళవారం ఆందోళన చేశారు. రైతులు మాట్లాడుతూ ఐదు రోజులుగా తొమ్మిది గంటలు ఇవ్వాల్సిన వ్యవసాయ విద్యుత్ సరఫరాలో రెండు నుంచి మూడు గంటలు కోత విధిస్తున్నారని అన్నారు. దీంతో పొట్ట దశలో ఉన్న మొక్కజొన్న పంటలకు సమృద్ధిగా నీరు అందకపోవడంతో ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతలపై ఏఈ, డీఈలను అడుగుతుంటే ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

టెన్త్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

నూజివీడు టౌన్/ముసునూరు ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):నూజివీడు మండలం గొల్లపల్లి అన్నేరామకృష్ణయ్య జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్‌ఆఫ్ నూజివీడు గ్రేటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మోటివేషన్ తరగతులను నిర్వహించారు. కెరీర్‌గైడెన్స్ పై వరంగల్‌కు చెందిన జక్కోజు విజయ్ వివరించారు. సమయపాలన ప్రాముఖ్యత, సైబర్ సెక్యూరిటీ , బుక్ రీడింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. లయన్స్‌క్లబ్ కోఆర్డినేటర్ రాజు పాల్గొన్నారు. ముసునూరు జడ్పీ పాఠశాలలో మంగ ళవారం నూజివీడు లైన్స్‌క్లబ్ కో-ఆర్డినేటర్ కె.ప్రసాదరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మంచిని స్వీకరించి, చెడుకు దూరంగా ఉండాలని మోటివేషనల్ స్పీకర్ విజయ్ జాకోజ్ అన్నారు. పదో తరగతి పరీక్షలు మొదటి అగుడని త్వరలో జరిగే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. హెచ్‌ఎం సునీల, గంగుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చిన్నారిపై ఉపాధ్యాయుడి విచక్షణారహిత దాడి



కమిలిపోయిన చిన్నారి శరీరం

ముసునూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అల్లరి చేస్తోందని ఎల్‌కేజీ చదువుతున్న చిన్నారిని ఓ ఉపాధ్యాయుడు విచక్షణారహితంగా కొట్టిన ఘటన మంగళవారం చెక్కపల్లిలో చోటు చేసుకుంది. నూజివీడు మండలం అన్నవరానికి చెందిన డోలా మాధురి, మురళీల చిన్న కుమార్తె వైష్ణవి, ముసునూరు వలస పల్లిలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటోంది. చిన్నారి చెక్కపల్లిలో ఉన్న చైతన్య పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతోంది. ఈ క్రమంలో చిన్నారి అల్లరి చేసోందని ఉపాధ్యాయుడు సురేష్ చేతితో వీపుపై విచక్షణారహితంగా కొట్టాడు. సాయంత్రం ఇంటికి వెళ్ళిన చిన్నారిని అమ్మమ్మ ఎత్తుకోగా ఒక్కసారిగా గుక్కపట్టి ఏడ్చింది. చిన్నారి వీపును చూడగా ఎర్రగా కంది ఉండటంతో అమ్మమ్మ, స్థానికులు పాఠశాలకు వెళ్ళి యాజమాన్యాన్ని ప్రశ్నించారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో చిన్నారి బంధువులు ఆందోళనకు దిగారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుడుపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చిన తల్లిదండ్రులు, చిన్నారిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రస్తుతం చిన్నారి చికిత్స పొందుతోంది. పోలీసులు స్కూల్ వద్దకు చేరుకుని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చర్యలు చేపట్టారు.



పట్టు వస్త్రాలతో వస్తున్న మంత్రి సారథి

శోభనాచల స్వామికి పట్టువస్త్రాలు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామికి మంత్రి కొలుసు పార్థసారథి పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో 24 వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ త్వరలో రూ.2 కోట్లతో నిర్మించే ఘాట్‌రోడ్డు ప్రారంభిస్తామన్నారు. గ్రామంలో కల్వర్టు, ప్రత్యేక నిధులతో సీసీరోడ్డు నిర్మిస్తానన్నారు. మడుపల్లి గోపాల్, మాదల సత్యకుమార్, బెజవాడ శ్రీనివాసరావు, సగుర్తి రమేష్, నైనవరపు చక్రధర్, మాదల బుజ్జి, ఆలయ అన్నదాన కమిటీ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి రూ.లక్ష విరాళం

చాట్రాయి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు చెయ్యాలని కోరుతూ హైదరాబాద్‌లో 7న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరగనున్న లక్ష డప్పులు-లక్ష గొంతులు కార్యక్రమానికి మండలంలోని పోలవరం వాస్తవ్యుడు, మహారాష్ట్రలో ఇంజినీరుగా పనిచేస్తున్న బిలుగుది జీవన్ మహేష్ రూ.లక్ష విరాళం మంగళవారం కృష్ణ మాదిగకు అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు తొమ్మండ్రు రుద్రయ్య, ముల్లంగి కుటుంబరావు, బిలుగుది బాబూరావు రవిరామ్ పాల్గొన్నారు.

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మొక్కజొన్నలో కత్తెర పురుగు గురించి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చాట్రాయి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రబీ మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని నూజివీడు వ్యవసాయశాఖ ఏడీఏ విద్యాసాగర్ అన్నారు. నరశింహారావుపాలెంలో మంగళవారం రైతులతో కలిసి మొక్కజొన్న వరి పొలాలను ఏడీఏ పరిశీలించారు. రైతులతో ఆయన మాట్లాడుతూ మొక్కజొన్నకు కత్తెర పురుగు ఆశిస్తే తీవ్ర నష్టం కలిగిస్తుందని దీని నివారణకు ఇమామేటిక్ బెంజోయట్ 5 శాతం ఎస్‌జీ,వేపనూనె కలిపి పిచికారి లేదా మొదళ్ళలో పోయడం ద్వారా లార్వాను గుడ్లను నిర్మూలించి పంటను కాపాడుకోవచ్చునన్నారు. రైతులు తమ గ్రామంలోని రైతుసేవా కేంద్రానికి వెళ్ళి ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని కోరారు. టీడీపీ నాయకులు తల్లాడ శ్రీనివాసరావు, కట్టా దుర్గారావు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎరువుల షాపులో రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారి నాగకుమార్

రూ.1.06 లక్షల విలువైన పురుగు మందులు సీజ్

ముదినేపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోని ఇంటర్నల్ స్క్వాడ్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. స్క్వాడ్ ఇన్‌చార్జ్, చింతలపూడి ఏడీఏ నాగకుమార్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి చిగురుకోట దుర్గాశ్రీ ట్రేడర్స్‌లో అవకతవకలు గుర్తించారు. రికా ర్డుల్లో నమోదు చేయకుండా, పత్రాలు లేకుం డా షాపుల్లో నిల్వ చేసిన సుమారు రూ.లక్షా ఆరు వేల విలువైన పురుగు మందులను సీజ్ చేశారు. చట్టాన్ని ఉల్లంఘించి ఎరువులు, పురుగు మందుల వ్యాపారం నిర్వహించే డీల ర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరిం చా రు. ఏవో వేణుమాధవ్ తనిఖీల్లో పాల్గొన్నారు.

రుచికరమైన ఆహారాన్ని అందించాలి

కైకలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ పిల్లలకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని ఐసీడీఎస్ పీడీ పి.శారద అన్నారు. కైకలూరు శివారు దానగూడెంలోని అంగన్వాడీ ప్రీస్కూల్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థుల ఎత్తు, బరువు రికార్డులను పరిశీలించారు. కిచెన్ రూం శుభ్రంగా ఉంచాలని సూచించారు. మెనూ ప్రకారం చిన్నారులకు ఆహారం ఇవ్వాలని, ఆహారం శుచిగా, రుచికరంగా ఉండేలా చూడాలన్నారు. ఐసీడీఎస్ పీవో దీప్తి, సూపర్‌వైజర్ కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

యువతిని వేధించిన ఇద్దరి అరెస్ట్

ముదినేపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గురజ గ్రామంలో ఒక యువతిని ప్రేమించాలంటూ వేధిస్తున్న కేసులో పోలీసులు ఇద్దరు యువకులను అరెస్ట్ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బి.ఆనంద్, బి.వరప్రసాద్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ వి.ఎస్.వీరభద్రరావు తెలిపారు. ప్రధాన నిందితుడు ఆనంద్‌ను కైకలూరు కోర్టులో హాజరుపరగా సహకరించిన వరప్రసాద్‌కు స్టేషన్ బెయిల్ ఇచ్చారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

ముసునూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని రమణక్క పేట పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య సిబ్బంది మంగళవారం అవగహన ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్ రావడానికి గల కారణాలు, వ్యాధిని తొలిదశలోనే ఎలా గుర్తించాలో డాక్టర్ కరిముల్లా వివరించారు. ప్రస్తుతం ఎన్సీడీ సీడీ సర్వేలో భాగంగా వైద్య బృందాలు ప్రతి గ్రామంలో ప్రతి గృహాన్ని సందర్శించి క్యాన్సర్ స్క్రీనింగ్ చేసి అనుమానితుల్ని జిల్లా ఆసుపత్రులకు పంపి, వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా వైద్య సేవలు అందిస్తారన్నారు. డాక్టర్ అవినాష్, సూపర్‌వైజర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బాధితులకు రూ.4 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

చాట్రాయి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్తపూరు గ్రామానికి చెందిన రాంబాబు అనారోగ్యానికి గురై హైదరాబాద్ యశోధ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నారు. రెండు రోజుల క్రితం అతని కుటుంబ సభ్యులు గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథిని కలిసి వైద్యానికి ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని వేడుకున్నారు. సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.4 లక్షలు మంజూరు చేయించి మంగళవారం నూజివీడు క్యాంప్ కార్యాలయంలో రాంబాబు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు.

త్వరితగతిన రహదారి పనులు పూర్తి చేయాలి

నూజివీడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బలివే శివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకుని నూజివీడు - ఏలూరు ప్రధాన రహదారి అభివృద్ధిపనులను చేపట్టి త్వరితగతిన పూర్తిచేయాలని మంత్రి కొలుసు పార్థసారథి అధికారులకు సూచించారు. నూజివీడు ఏలూరు రహదారిని ఆయన పరిశీలించారు. రహదారి పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో రహదారి అభివృద్ధికి గతంలోనే టెండర్లు పూర్తి అవ్వగా, కాంట్రాక్ట్ సంస్థ నిర్మాణానికి ముందుకు రాలేదు. ఆ సంస్థతో మాట్లాడి, త్వరితగతిన రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు.